



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 90 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : శ్రీకాకుళం సోమవారం 13 ఏప్రిల్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 90 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : SRIKAKULAM MON 13 APRIL 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, Chittor, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


## నా ప్రమేయం నిరూపిస్తే దేనికైనా సిద్ధం...

### ఆరోపణలపై మంగ్లీ తీవ్ర భావోద్వేగం



- లాయర్ సుబ్బారావుపై పంజాగుట్ట పోలీసులకు సింగర్ మంగ్లీ ఫిర్యాదు
- బిగ్ బాస్ షో ఎంట్రీ కోసమే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆరోపణ
- గతంలో తన వీడియోలు తొలగించేందుకు రూ.10 లక్షలు డిమాండ్ చేశారని వెల్లడి
- ఆర్థిక నేరాలతో తనకు సంబంధం లేదని కన్నీటిపర్యంతమైన మంగ్లీ
- ఇరువర్గాల ఫిర్యాదులపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు

- మిగతా2లో

## అమరావతిలో క్వాంటమ్.. మహత్తర ముందడుగు

- భారతదేశపు తొలి దేశీయ క్వాంటం కంప్యూటర్ల ఆవిష్కరణకు ఏపీ సిద్ధం
- రేపు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 'అమరావతి 1S, 1Q' కంప్యూటర్ల ఏర్పాటు
- అమరావతిని గ్లోబల్ క్వాంటం హబ్‌గా మార్చడమే లక్ష్యమన్న మంత్రి లోకేశ్



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం టెక్నాలజీ రంగంలో ఒక చారిత్రక ఘట్టానికి సిద్ధమవుతోంది. భారతదేశంలోనే మొట్టమొదటి దేశీయ, ఓపెన్-యాక్సెస్ క్వాంటం కంప్యూటర్లను అమరావతిలో ఆవిష్కరించనున్నారు. ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 14న ముఖ్యమంత్రి చంద్రబాబు వీటిని ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ద్వారా కీలక వివరాలు పంచుకున్నారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'అమరావతి 1S', 'అమరావతి 1Q' పేరుతో ఈ క్వాంటం కంప్యూటర్లను జాతికి అంకితం చేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా అమరావతిని 'క్వాంటం వ్యాలీ'గా, ఒక గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ పేర్కొన్నారు. "భారత్‌లో తయారై, భారతీయులకు అందుబాటులో ఉంటూ, ప్రపంచానికి సేవలు అందించడమే" తమ ధ్యేయమని ఆయన వివరించారు. ఈ పరిణామంతో దేశ క్వాంటం భవిష్యత్తుకు ఆంధ్రప్రదేశ్ నాయకత్వం వహిస్తుందని, భవిష్యత్ టెక్నాలజీ అమరావతి నుంచే మొదలవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ ఆవిష్కరణతో క్వాంటం కంప్యూటింగ్ రంగంలో ఏపీ కీలక పాత్ర పోషించనుంది.

## "జగన్ పోకడలు భరించలేం.. అతన్ని బెంగళూరులోనే ఉంచండి" అని విజయమ్మ నాడే చెప్పారు


- జగన్ రెడ్డి రాజకీయాలు ఉగ్రవాదాన్ని మించిపోయాయని మంత్రి నిమ్మల ధ్వజం
- అధికారం కోసం సొంత బాబాయ్‌ను గొడ్డలితో చంపిన చరిత్ర జగన్‌దని విమర్శ
- రంగా హంతకులను అక్కున చేర్చుకుని పదవులిచ్చారని ఆరోపణ
- 'గొడ్డలి పార్టీ'గా మారిన వైసీపీకి రాజకీయ సమాధి తప్పదని హెచ్చరిక
- మీడియాను బెదిరిస్తూ ఫోర్త్ ఎస్టేట్ గొంతు నొక్కుతున్నారని మండిపాటు



**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ అధినేత జగన్ రాజకీయాలు ఉగ్రవాదాన్ని మించిన ఉన్మాదంతో సాగుతున్నాయని, ఆయన 'గొడ్డలి రాజకీయం' రాష్ట్రానికి పెను ప్రమాదంగా పరిణమించిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "నరుకుతాం, చంపేస్తాం" అనే నీచమైన భాషతో రాజకీయాలు చేస్తూ, విధ్వంసాన్నే తమ అజెండాగా వైసీపీ మార్చుకుందని ఆయన విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ

- మిగతా2లో

## మహదేవుని సత్రంలో పుష్కరాల పనులకు మంత్రి ఆనం శంకుస్థాపన



**పెన్ పవర్ డెస్క్:**తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని మహదేవునిసత్రంలో పుష్కర పనులకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శంకుస్థాపన చేశారు. రాజమహేంద్రవరంలో రూ.9.55 కోట్లతో ఆరు అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2027 జూన్ 26 నుంచి గోదావరి మహా పుష్కరాలు ప్రారంభమవుతాయని చెప్పారు. పుష్కరాల కోసం ఇప్పటికే మూడు సమావేశాలు నిర్వహించామని అన్నారు. గోదావరి పరివాహక ప్రాంతానికి చెందిన 12 మంది మంత్రులతో సబ్‌కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. పుష్కరాల కోసం ఇప్పటికే 18 పనులు ప్రారంభించామన్నారు.



## అమర్‌నాథ్ యాత్ర 2026 షెడ్యూల్ విడుదల.. 57 రోజుల పాటు యాత్ర

- ఈ ఏడాది అమర్‌నాథ్ యాత్ర జులై 3న ప్రారంభం
- మొత్తం 57 రోజుల పాటు కొనసాగనున్న పవిత్ర యాత్ర
- రక్షాబంధన్ రోజున ఆగస్టు 28న యాత్ర ముగింపు
- ఈ నెల 15 నుంచి యాత్ర కోసం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం

**పెన్ పవర్ డెస్క్:**పవిత్ర అమర్‌నాథ్ యాత్ర 2026 షెడ్యూల్‌ను జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. ఈ ఏడాది యాత్ర జులై 3న ప్రారంభమై, 57 రోజుల పాటు కొనసాగి ఆగస్టు 28న రక్షాబంధన్ పర్వదినం రోజున ముగుస్తుందని

- మిగతా2లో

## టీడీపీ ఎమ్మెల్యే యార్లగడ్డకు భారీ ఊరట... విదేశాలకు వెళ్లేందుకు కోర్టు గ్రీన్ సిగ్నల్

- గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అమెరికా పర్యటనకు కోర్టు అనుమతి
- గత ప్రభుత్వ హయాంలో కేసులు... రెండేళ్లుగా ఎదురైన ఆటంకాలు
- అమెరికాలో ఉండే చిరునామాతో సహా పూర్తి వివరాలు సమర్పించాలని కోర్టు ఆదేశం
- టూర్ నుంచి తిరిగి వచ్చేవరకు ఫోన్ ఆన్‌లోనే ఉంచాలంటూ కఠిన నిబంధనలు
- ఈ నెలాఖరులో అమెరికాకు వెళ్లేందుకు యార్లగడ్డ వెంకట్రావు సన్నాహాలు

- మిగతా2లో




## చర్చలు విఫలం...



- పాకిస్థాన్‌లో జరిగిన అమెరికా-ఇరాన్ ఉన్నత స్థాయి చర్చలు విఫలం
- అమెరికా తమ నమ్మకాన్ని గెలవడంలో విఫలమైందన్న ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘలీబాఫ్
- తమ షరతులను ఇరాన్ అంగీకరించలేదంటూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఆరోపణ
- అణ్వాయుధాలు తయారు చేయబోమని దీర్ఘకాలిక హామీ ఇవ్వాలని అమెరికా డిమాండ్
- ఇప్పటికే తమ తుది ప్రతిపాదనను ఇరాన్ ముందు ఉంచామని వెల్లడి


- మిగతా2లో

## భారత్ తో భయంకరమైన యుద్ధాన్ని ఆపడం పట్ల పాక్ ఇప్పటికీ కృతజ్ఞతలు చెబుతోంది

- భారత్-పాక్ మధ్య అణుయుద్ధాన్ని ఆపింది తానేనన్న డొనాల్డ్ ట్రంప్
- తన జోక్యంతో 5 కోట్ల మంది ప్రాణాలను కాపాడానని వ్యాఖ్య
- స్టేట్ ఆఫ్ ది యూనియన్ ప్రసంగంలో ఆపరేషన్ సిందూర్ ప్రస్తావన
- పాక్ నేతలు తనకు పదే పదే కృతజ్ఞతలు తెలుపుతున్నారన్న ట్రంప్
- మూడో పక్షం జోక్యం లేదని గతంలోనే స్పష్టం చేసిన భారత్

**పెన్ పవర్ డెస్క్:**భారత్, పాకిస్థాన్ మధ్య జరగాల్సిన పూర్తిస్థాయి యుద్ధాన్ని తాను ఆపడం వల్లే దాదాపు 5 కోట్ల మంది ప్రాణాలు నిలిచాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన తాజా 'స్టేట్ ఆఫ్ ది యూనియన్ (రూపుఖ 2026)' ప్రసంగంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేస్తూ, 'ఆపరేషన్ సిందూర్' సమయంలో తన పాత్రను ప్రముఖంగా ప్రస్తావించారు. పాకిస్థాన్ నాయకులు తనకు నిరంతరం

- మిగతా2లో




## ఆశా భోంస్లేది ఒక ఐకానిక్ స్వరం



- ప్రముఖ గాయని ఆశా భోంస్లే మృతికి పవన్ కళ్యాణ్ సంతాపం
- ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు వెల్లడి
- ఆమె బహుముఖ ప్రజ్ఞను, చిరస్మరణీయ గీతాలను గుర్తు చేసుకున్న జనసేనాని
- ఆశా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి

- మిగతా2లో

**పెన్ పవర్ డెస్క్:**ప్రముఖ గాయని, లెజెండరీ సింగర్ శ్రీమతి ఆశా భోంస్లే మరణవార్త తనను తీవ్రంగా కలచివేసిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఒక ప్రకటనలో

## దివికేగిన లెజెండరీ గాయని ఆశా భోంస్లే

**పెన్ పవర్ డెస్క్:**భారతీయ సంగీత ప్రపంచంలో ఓ శకం ముగిసింది. సుప్రసిద్ధ గాయని ఆశా భోంస్లే ఇక లేరు. తీవ్ర అస్వస్థతతో శనివారం ముంబైలోని బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో చేరిన ఆశా భోంస్లే.. చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. శనివారం తీవ్రమైన నీరసం, ఛాతీలో ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో

- ముంబై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- కన్నీళ్లతో ప్రకటించిన భోంస్లే కుమారుడు, మనవరాలు
- సోమవారం శివాజీ పార్క్ లో అంత్యక్రియలు
- 20కి పైగా భాషల్లో 12,000 పాటలు పాడిన గాన దిగ్గజం

- మిగతా2లో






# సంపద తెచ్చేది ఎవరు?

అమరావతిని చంద్రబాబు పదే పదే హైదరాబాద్ తో పోలుస్తున్నారు. హైదరాబాద్ కు అమరావతికి ముడి పెట్టకూడదు. హైదరాబాద్ కు ఆదాయం తెచ్చి పెట్టింది అక్కడ అసెంబ్లీ కాదు.. సచివాలయం కాదు.. మంత్రుల నివాసాలు కాదు.. హైకోర్టు కాదు.. కేవలం ఐటీ కంపెనీలు.. పరిశ్రమలు.. హైదరాబాద్ కు వెళితే ఖచ్చితంగా ఏదో రకమైన ఉపాధి దొరుకుతుంది. ఎటు చూసినా పరిశ్రమలు.. సినీ పరిశ్రమ నుంచి ఫార్మా.. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు వేల సంఖ్యలో ఉంటాయి. అవే హైదరాబాద్ కు అంతటి ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయి.మరొక వైపు టూరిజం సిటీగా కూడా హైదరాబాద్ ఇన్ కమ్ తెచ్చిపెడుతుంది. హైదరాబాద్ లో ప్రజలు రెండు కోట్లు దాటేశారు. అమరావతిలో రెండు లక్షల మంది లేరు. పైగా ఎలాంటి పరిశ్రమలు లేవు. ఏదైనా పరిశ్రమలు ఉంటే తప్ప అక్కడ హోటల్ రంగమైనా.. సినీ రంగమైనా.. మరొక పరిశ్రమ అయినా వచ్చి వాలుతుంది. జనం లేని చోటకు వచ్చి వారు ఏం చేస్తారు. అక్కడ డబ్బులు పెట్టి ఎన్నేళ్లలో తాము పెట్టిన పెట్టుబడిని రాబట్టుకుంటామన్న అంచనాలు కూడా వారికి అమరావతిని చూస్తే ఉండవు. అందుకే వెనక్కు తగ్గుతారు. కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తప్ప అక్కడ మరో పరిశ్రమకు ఇప్పట్లో అవకాశం లేదు. అమరావతిలోనూ వేగంగా పరిశ్రమలు వస్తే తప్ప నిదానంగా డెవలెప్ అయ్యే అవకాశాలున్నాయి.

**హైదరాబాద్ స్పెషాలిటీ...**

మరొకవైపు హైదరాబాద్ కు, అమరావతికి వాతావరణలో ఎంతో తేడా ఉంది. హైదరాబాద్ లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంది. కావాల్సినంత ఎంజాయ్ మెంట్ లభిస్తుంది. అన్ని రాష్ట్రాల ప్రజలు ఇక్కడ స్థిరపడటంతో పాటు వచ్చే పోయే వారితో కళకళలాడుతుంటుంది. రోజుకు హైదరాబాద్ కు ఐదు లక్షల మంది వివిధ పనుల కోసం అనేక ప్రాంతాల నుంచి వస్తారని అంచనా. అదే అమరావతికి అంత సీన్ ఇప్పుడుందా? భవిష్యత్ లో ఎప్పుడొస్తుంది? అన్న ప్రశ్నకు సమాధానం లేకుండా పదే .. పదే హైదరాబాద్ తో పోలిక చేయకుండా.. నిదానంగా అమరావతిని అభివృద్ధి చేసుకుని వెళితే చంద్రబాబుకు మంచిది. అంతే తప్ప ఆకాశానికి నిచ్చెనలు వేస్తే అభాసుపాలయ్యేది ఎవరో కాదు.. తెలిసిందా సామీ.

# అమర్‌నాథ్ యాత్ర 2026 షెడ్యూల్ విడుదల.. 57 రోజుల పాటు యాత్ర

- మొదటి పేజి తరువాయి

లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వెల్లడించారు. ఈ మేరకు ఆయన కార్యాలయం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వివరాలను పంచుకుంది. షెడ్యూల్ ప్రకారం యాత్ర ప్రారంభానికి ముందు జూన్ 29న జ్యేష్ఠ పూర్ణిమ సందర్భంగా శివుని ఆశీస్సులు కోరుతూ 'ప్రథమ పూజ' నిర్వహిస్తారు. యాత్ర కోసం ఈ నెల 15 నుంచి అడ్వాన్స్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని లెఫ్టినెంట్ గవర్నర్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న జమ్మూకశ్మీర్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఎస్?బీఐ, యస్ బ్యాంక్‌లకు చెందిన 554 బ్రాంచుల ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో భక్తులు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు.

దక్షిణ కశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాలో సముద్ర మట్టానికి 3,888 మీటర్ల ఎత్తులో ఉన్న హిమాలయ గుహలో ఈ పుణ్యక్షేత్రం ఉంది. ఇక్కడ సహజసిద్ధంగా ఏర్పడే మంచు లింగాన్ని శివుని స్వరూపంగా భక్తులు విశ్వసిస్తారు.భక్తులు రెండు మార్గాల ద్వారా ఈ యాత్రను పూర్తి చేసుకోవచ్చు. ఒకటి సాంప్రదాయ పహల్గామ్ మార్గం కాగా, మరొకటి బల్తాల్ మార్గం. పహల్గామ్ మార్గంలో 34 కిలోమీటర్ల ట్రెక్కింగ్ ఉంటుంది, దీనికి 3-5 రోజులు పడుతుంది. బల్తాల్ మార్గం 14 కిలోమీటర్లు మాత్రమే ఉండి, యాత్ర పూర్తి చేసి అదే రోజు బేస్ క్యాంప్‌కు తిరిగి రావచ్చు. ఈ రెండు మార్గాల నుంచి హెలికాప్టర్ సేవలు కూడా అందుబాటులో ఉంటాయి.

## ఆశా భోంస్లేది ఒక ఐకానిక్ స్వరం

- మొదటి పేజి తరువాయి

తెలిపారు. భారతీయ సినిమాలో ఆశా భోంస్లేది ఒక ఐకానిక్ స్వరమని, ఆమె లేని లోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు.పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. "హిందీతో పాటు మరాఠీ, తెలుగు, బెంగాలీ సహా అనేక భాషలలో కొన్ని దశాబ్దాల పాటు ఆశా భోంస్లే గారు లెక్కలేనన్ని చిరస్మరణీయ గీతాలను ఆలపించారు. శాస్త్రీయ, పాశ్చాత్య, సమకాలీన సంగీత శైలులలో ఆమె చూపిన అసాధారణమైన బహుముఖ ప్రజ్ఞ అన్ని తరాల సంగీత ప్రియుల మన్ననలను పొందింది" అని కొనియాడారు."దమ్ మారో దమ్", "చురాలియా హై తుమ్నే", "ఇన్ ఆంఖోం కీ మస్తీ", "రాధా కైసే నా జలే" వంటి ఆమె పాటలు ఎప్పటికీ నిలిచిపోతాయని పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. తెలుగు సినిమాలలో ఆమె పాడిన పాటలు తక్కువే అయినా, హిందీ సంగీతం ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ఆమె ఎంతో ఆదరణ పొందారని తెలిపారు. ఈ దుఃఖ సమయంలో ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు పవన్ పేర్కొన్నారు.

# "జగన్ పోకడలు భరించలేం.. అతన్ని బెంగళూరులోనే ఉంచండి" అని విజయమ్మ నాడే చెప్పారు

- మొదటి పేజి తరువాయి

కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జగన్ రెడ్డి తన హిడెన్ అజెండాను ఇప్పుడు బహిరంగంగానే ప్రకటిస్తున్నారని అన్నారు. అధికారం కోసం ఎంతటి దారుణానికైనా ఒడిగట్టేలా వారి తీరు ఉందని మండిపడ్డారు.

**ఉగ్రవాదం కన్నా ప్రమాదకరం**

రాజకీయ పార్టీలు ప్రజలకు మేలు చేస్తామని చెప్పాలి కానీ, వైసీపీ మాత్రం తాము అధికారంలోకి వస్తే ఉన్నవి పడగొడతామని, పనులు ఆపేస్తామని, యువతను చెడగొడతామని చెబుతోందని నిమ్మల ఎద్దేవా చేశారు. వైసీపీ 'యూత్ పాలసీ' అంటే మద్యం వ్యాపారాలు చేయడం, కొత్త మాదక ద్రవ్యాలు తెచ్చి యువత భవిష్యత్తును నాశనం చేయడమేనా? అని ప్రశ్నించారు.

"గుంటూరు ఇవతల లాగి కొడతాం, అవతల నరుకుతాం" అని బాహాటంగా హెచ్చరిస్తూ, తల్లులకు పుత్రశోకం మిగల్చడానికే వైసీపీ నేతలు అధికార దాహంతో ఉన్నారని ఆరోపించారు. జంతువులను నరికి ఆ రక్తాన్ని ఫ్లెక్సీలపై చల్లుతూ రాక్షసానందం పొందేవారు ప్రజలకు ఏం మేలు చేస్తారని నిలదీశారు. వాస్తవాలు రాస్తున్న మీడియా సంస్థల నాలుకలు కోస్తామని బెదిరించడం రాజ్యాంగం కల్పించిన ఫోర్త్ ఎస్టేట్ గొంతు నొక్కడమేనని అన్నారు. 151 సీట్ల నుంచి 11 సీట్లకు ప్రజలు పరిమితం చేసినా జగన్‌కు బుద్ధి రాలేదని, తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోకుండా మరింత ఉన్మాదిలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

**వివేకా హత్యపై ప్రశ్నల వర్షం**

వివేకానందరెడ్డి హత్య కేసును ప్రస్తావిస్తూ మంత్రి నిమ్మల, జగన్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. "రాజకీయాల కోసం సొంత బాబాయ్‌నే గొడ్డలితో వేటు వేసిన చరిత్ర జగన్‌ది. వివాదరహితుడైన వివేకాను ఎంపీ పదవికి రాజీనామా చేయాలని బెదిరించినప్పుడు, నాడు సోనియా గాంధీ మిమ్మల్ని మందలించింది నిజం కాదా?" అని ప్రశ్నించారు. వివేకా గొడ్డలిపోటుతో చనిపోతే, దాన్ని 'గుండెపోటు'గా సాక్షి మీడియాలో ఎందుకు ప్రచారం చేశారని నిలదీశారు. సొంత చిన్నాన్న హత్యకు గురైతే 12 గంటలు ఆలస్యంగా వచ్చి సాక్ష్యాలు చెరిపేయడంలో ఎందుకు నిమగ్నమయ్యారని అడిగారు. ప్రపంచంలో ఎక్కడైనా హత్యకు గురైన వ్యక్తికి కుట్లు వేసి కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తారా? అని మండిపడ్డారు. పరిటాల రవి హత్య కేసులో సాక్షులు మాయమైనట్లే, నేడు వివేకా హత్య కేసులోనూ సాక్షులను మాయం చేస్తున్నారని, దీనికి జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**కుటుంబ సభ్యుల పట్ల వైఖరి ఇదేనా?**

జగన్ రెడ్డి తన కుటుంబ సభ్యుల పట్ల వ్యవహరించిన తీరును రాష్ట్ర ప్రజలంతా చూశారని నిమ్మల అన్నారు. "నా తల్లి, నా చెల్లి" అంటూనే వారిని ఇంటి నుంచి బయటకు గెంటారని ఆరోపించారు. ఇప్పుడు రాష్ట్రంలోని మహిళలకు మేలు చేస్తానని చెప్పడం నయవంచన కాదా? అని ప్రశ్నించారు. నాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించి, ఆయన ఆచూకీ కూడా తెలియని సమయంలో సంతకాలు సేకరించి ముఖ్యమంత్రి కావాలని చూడటం జగన్ వికృత మనస్తత్వానికి నిదర్శనమని అన్నారు. "జగన్ రాకను తండ్రి రాజశేఖర్ రెడ్డి గారే ఇష్టపడలేదు. మీరు చెప్పి అతన్ని బెంగళూరులోనే ఉండమనండి" అని స్వయంగా విజయమ్మ గారే నాడు రోశయ్య గారికి ఫోన్ చేసి వేడుకున్నారని, దీన్నిబట్టి జగన్ నైజం అర్థం చేసుకోవచ్చని తెలిపారు.

**రంగా గారి పేరు ఎత్తే అర్హత లేదు**

వంగవీటి రంగా గారి గురించి మాట్లాడే నైతిక అర్హత జగన్‌కు లేదని నిమ్మల రామానాయుడు ఘాటుగా విమర్శించారు. "రంగా గారి హంతకులను అక్కున చేర్చుకున్న చరిత్ర జగన్‌ది. రంగా హత్య కేసులో ప్రధాన నిందితుడి కుమారుడు ఈరోజు ఏ పార్టీలో ఉన్నాడో జగన్ చెప్పాలి. హంతక కుటుంబానికి హైదరాబాద్‌లో కోట్ల విలువైన భూమిని ఎందుకు గిఫ్ట్‌గా ఇచ్చారు?" అని ప్రశ్నించారు.

రంగా గారిని 'రౌడీ' అని అవమానించిన గౌతమ్ రెడ్డికి ఫైబర్ గ్రిడ్ ఛైర్మన్ పదవి ఇచ్చి సత్కరించడం, రంగా గారిపై జగన్‌కు ఉన్న విద్వేషానికి నిదర్శనమని అన్నారు. హంతక కుటుంబాలతో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతూ రంగా పేరు ఎత్తడానికి సిగ్గుండాలని మండిపడ్డారు.

**గొడ్డలి పార్టీకి రాజకీయ సమాధి**

నాడు తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఆర్థిక ఉగ్రవాదిగా మారిన జగన్, నేడు రాజకీయ ఉగ్రవాదిగా మారి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని నిమ్మల ఆరోపించారు. 2019-24 మధ్య వైసీపీ పాలనతో జరిగిన నష్టం, రాష్ట్ర విభజన నష్టం కన్నా ఎక్కువని అన్నారు. ఆ విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కాపాడటానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాన్ని మళ్లీ పట్టాలెక్కిస్తున్నారని తెలిపారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడిన పడుతుంటే, మళ్లీ విధ్వంసం సృష్టించాలని జగన్ చూస్తున్నారని విమర్శించారు. వైసీపీ జెండాను పక్కనపెట్టి 'గొడ్డలి'ని జెండాగా చేసుకున్న ఈ 'గొడ్డలి పార్టీ'కి ప్రజలు రాజకీయ సమాధి కట్టాలని, ఇలాంటి ఉన్మాద పార్టీని రాష్ట్రం నుంచి శాశ్వతంగా తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

# భారత్ తో భయంకరమైన యుద్ధాన్ని ఆపడం పట్ల పాక్ ఇప్పటికీ కృతజ్ఞతలు చెబుతోంది

- మొదటి పేజి తరువాయి

కృతజ్ఞతలు తెలుపుతున్నారని ఆయన చెప్పుకొచ్చారు.

గతేడాది (2025) కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిలో 26 మంది భారతీయులు మరణించిన విషయం తెలిసిందే. దీనికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' ప్రారంభించింది. ఈ పరిణామంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరి, అణు యుద్ధం ముంగిట నిలిచాయని ట్రంప్ వివరించారు. ఆ క్లిష్ట సమయంలో తాను జోక్యం చేసుకోకపోతే పెను విధ్వంసం జరిగి ఉండేదని అన్నారు."భారత్, పాకిస్థాన్ మధ్య అణు యుద్ధం జరిగి ఉండేది. దానివల్ల 3 నుంచి 5 కోట్ల మంది ప్రాణాలు కోల్పోయేవారు. 'మీరు లేకపోతే నేను సహా 3.5 కోట్ల మంది చనిపోయేవారు' అని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నాతో చెప్పారు" అని ట్రంప్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. తన మొదటి 10 నెలల పాలనలోనే భారత్-పాక్ ఘర్షణ సహా 8 యుద్ధాలను అంతం చేశానని గుర్తుచేశారు. ఆ ఘర్షణ సమయంలో 11 ఖరీదైన యుద్ధ విమానాలు కూలిపోయాయని కూడా ప్రస్తావించారు. పాక్ ప్రధాని తన చీఫ్ ఆఫ్ స్టాఫ్ ముందే తనకు బహిరంగంగా కృతజ్ఞతలు తెలిపారని ట్రంప్ ఉదహరించారు. అయితే, ట్రంప్ వాదనలను భారత్ గతంలోనే తోసిపుచ్చింది. భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం పూర్తిగా ద్వైపాక్షిక చర్చల ద్వారానే జరిగిందని, ఇందులో ఎలాంటి మూడో పక్షం జోక్యం లేదని భారత విదేశాంగ శాఖ పలుమార్లు స్పష్టం చేసింది.

# టీడీపీ ఎమ్మెల్యే యార్లగడ్డకు భారీ ఊరట... విదేశాలకు వెళ్లేందుకు కోర్టు గ్రీన్ సిగ్నల్

గత ప్రభుత్వ హయాంలో ఎదురైన కేసులు తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. తాజాగా ఈ కేసుల కారణంగా ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తన అమెరికా పర్యటనకు తీవ్ర ఆటంకాలను ఎదుర్కొన్నారు. అయితే, సుదీర్ఘ నిరీక్షణ అనంతరం పలు కఠినమైన షరతులతో ఆయన విదేశీ పర్యటనకు మచిలీపట్నం ఎస్సీ, ఎస్టీ జిల్లా కోర్టు అనుమతి మంజూరు చేసింది. దీంతో ఆయనకు ఊరట లభించినట్లయింది.గత రెండేళ్లుగా అమెరికాలో ఉన్న తన వ్యాపార కార్యకలాపాలను ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు యార్లగడ్డ వెంకట్రావు ప్రయత్నిస్తున్నారు. అయితే, గత ప్రభుత్వ కేసులను కారణంగా చూపుతూ న్యాయస్థానాలు ఆయన విదేశీ పర్యటనకు అనుమతులు నిరాకరిస్తూ వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయన మరోసారి కోర్టును ఆశ్రయించగా, ఈసారి సానుకూల స్పందన లభించింది. అయితే, న్యాయస్థానం పర్యటనకు అనుమతి ఇస్తూనే పలు కఠినమైన నిబంధనలను విధించింది. ఈ నిబంధనలన్నీ పక్కాగా పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

కోర్టు విధించిన షరతుల ప్రకారం.. యార్లగడ్డ తరఫున నలుగురు వ్యక్తులు పూచీకత్తు సమర్పించాలి. అమెరికా పర్యటనకు బయలుదేరే ముందు, అక్కడ ఏ ప్రాంతంలో, ఏ చిరునామాలో ఉంటారనే పూర్తి వివరాలను లిఖితపూర్వకంగా కోర్టుకు తప్పనిసరిగా అందించాలి. ఇక్కడి నుంచి బయలుదేరినప్పటి నుంచి తిరిగి వచ్చేవరకు తన సెల్ ఫోన్‌ను ఎల్లప్పుడూ ఆన్‌లోనే ఉంచుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ 2026 జులై 15 తేదీలోపు తిరిగి భారతదేశానికి రావాలి. కోర్టు అనుమతుల పొడిగింపునకు ఎలాంటి ప్రయత్నం చేయకూడదని, అనుమతిలోని షరతులను ఉల్లంఘించరాదని న్యాయస్థానం తన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొంది.దేశానికి తిరిగి వచ్చిన వారం రోజుల్లోపు కచ్చితంగా కోర్టు ఎదుట హాజరు కావాలని ఆదేశిస్తూ అమెరికా పర్యటనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. న్యాయస్థానం నుంచి అనుమతులు లభించడంతో, ఈ నెలాఖరులో అమెరికాకు వెళ్లేందుకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

# చర్చలు విఫలం...

అంతర్జాతీయంగా తీవ్ర ఉత్కంఠ రేపిన అమెరికా-ఇరాన్ ఉన్నత స్థాయి చర్చలు విఫలమయ్యాయి. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా సుమారు 21 గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ మారథాన్ చర్చలు ఎలాంటి ఒప్పందం కుదరకుండానే ముగిశాయి. చర్చలు విఫలమవడంపై ఇరు దేశాలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయి. చర్చల సమయంలో అమెరికా తమ నమ్మకాన్ని పొందడంలో పూర్తిగా విఫలమైందని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఖేర్ ఘలీబాఫ్ ఆరోపించారు. మరోవైపు, తమ షరతులను అంగీకరించడానికి ఇరాన్ నిరాకరించిందని, ఇది అమెరికా కంటే ఇరాన్‌కే ఎక్కువ నష్టమని యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ హెచ్చరించారు.చర్చల అనంతరం ఆదివారం ఘలీబాఫ్ 'ఎక్స్' వేదికగా వరుస పోస్టులు చేశారు. ఇరాన్ ప్రతినిధి బృందం పూర్తి సద్భావనతో, నిర్మాణాత్మకమైన ప్రతిపాదనలతో చర్చలకు హాజరైందని తెలిపారు. "చర్చలకు ముందు మేం పూర్తి చిత్తశుద్ధితో ఉన్నామని స్పష్టం చేశాం. కానీ గత రెండు యుద్ధాల అనుభవాల దృష్ట్యా వారి(అమెరికా)పై మాకు నమ్మకం లేదు. మా ప్రతినిధులు ఎన్నో మంచి ప్రతిపాదనలు చేసినా, ఈ దఫా చర్చల్లో ఇరాన్ ప్రతినిధి బృందం నమ్మకాన్ని గెలుచుకోవడంలో అవతలి పక్షం విఫలమైంది" అని ఆయన పేర్కొన్నారు.

"మా వాదన, మా సూత్రాలు అమెరికాకు అర్థమయ్యాయి. ఇప్పుడు మా నమ్మకాన్ని పొందగలదో లేదో నిర్ణయించుకోవాల్సింది వారే" అని ఘలీబాఫ్ మరో పోస్టులో సవాల్ విసిరారు. దేశ ప్రజలు తమకు అండగా నిలిచారని, 21 గంటల పాటు చర్చల్లో పాల్గొన్న తన సహచరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.మరోవైపు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా చర్చల వైఫల్యంపై స్పందించారు. "మేం 21 గంటల పాటు చర్చలు జరిపాం. ఇరాన్‌తో అనేక విషయాలపై మాట్లాడాం. ఇది శుభవార్తే అయినా, ఎలాంటి ఒప్పందం కుదరకపోవడం దురదృష్టకరం" అని ఆదివారం ఉదయం మీడియా సమావేశంలో తెలిపారు. "ఈ చర్చల్లో మా పరిమితులు ఏమిటో, ఏయే అంశాల్లో సర్దుకుపోగలమో, వేటిలో రాజీపడలేమో చాలా స్పష్టంగా చెప్పాం. కానీ మా షరతులను అంగీకరించడానికి వారు నిరాకరించారు. ఈ ఫలితం అమెరికా

కన్నా ఇరాన్‌కే ఎక్కువ నష్టం కలిగిస్తుంది" అని వాన్స్ వ్యాఖ్యానించారు.ఇరాన్‌ను అణ్వాయుధ సామర్థ్యం పొందకుండా నిరోధించడమే తమ ప్రధాన లక్ష్యమని వాన్స్ పునరుద్ఘాటించారు. "అణ్వాయుధాలను తయారుచేయబోమని ఇరాన్ నుంచి మాకు స్పష్టమైన హామీ కావాలి. కేవలం ఇప్పుడో, రెండేళ్లకో కాదు.. దీర్ఘకాలికంగా ఈ హామీ ఉండాలి. అలాంటి నిబద్ధత వారిలో ఇంకా కనిపించలేదు. త్వరలోనే అది వస్తుందని ఆశిస్తున్నాం" అని ఆయన అన్నారు. వాషింగ్టన్ ఇప్పటికే తన తుది ప్రతిపాదనను ఇరాన్ ముందు ఉంచిందని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యక్రమం, ఆంక్షల ఉపసంహరణ, తనిఖీల వంటి అంశాలపై గతంలోనూ చర్చలు జరిగి మధ్యలోనే నిలిచిపోయిన విషయం తెలిసిందే. తాజా వైఫల్యంతో ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ప్రతిష్టంభన మరింత ముదిరినట్లయింది.

# దివికేగిన లెజెండరీ గాయని ఆశా భోంస్లే

- మొదటి పేజి తరువాయి

వైద్యులు ఐసీయూకి తరలించి చికిత్స అందించినప్పటికీ ఫలితం దక్కలేదు. ఆమె మరణ వార్తను కుమారుడు ఆనంద్ భోంస్లే, మనవరాలు జానై భోంస్లే ధృవీకరించారు.ఆమె పార్థివ దేహాన్ని సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అభిమానుల సందర్శనార్థం ఆమె నివాసంలో ఉంచనున్నారు. అనంతరం, సాయంత్రం 4 గంటలకు ముంబైలోని శివాజీ పార్కులో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.దిగ్గజ గాయని లతా మంగేష్కర్ కు ఆశా భోంస్లే స్వయానా సోదరి. బ్రిటీష్ ఇండియాలోని సాంగ్లీ స్టేట్ లో 1933 సెప్టెంబర్ 8న జన్మించారు. 1943లో ఆమె తన సంగీత ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో 20కి పైగా భాషల్లో 12,000కు పైగా పాటలు పాడి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ (2011)లో స్థానం సంపాదించారు. తెలుగులో కూడా ఆమె పాడిన ఎన్నో పాటలు విశేష ప్రజాదరణ పొందాయి. ఆమె మరణం భారత సంగీత ప్రపంచానికి తీరని లోటు.

# నా ప్రమేయం నిరూపిస్తే దేనికైనా సిద్ధం...

ప్రముఖ జానపద గాయని మంగ్లీ, తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారంటూ న్యాయవాది సింగపోగు సుబ్బారావుపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేవలం బిగ్ బాస్ షోలో అవకాశం కోసమే సుబ్బారావు తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ప్రచారం పొందే ప్రయత్నం చేస్తున్నారని ఆమె తీవ్రంగా మండిపడ్డారు. ఈ వ్యవహారంపై మీడియాతో మాట్లాడుతూ ఆమె తీవ్ర భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇందులో తన ప్రమేయం నిరూపిస్తే దేనికైనా సిద్ధమన్నారు. నోట్లకట్టలతో కనిపించింది తన తమ్ముడు కాదని స్పష్టం చేశారు.సుబ్బారావు ఆరోపణలను తీవ్రంగా ఖండించిన మంగ్లీ, "నాపై చేస్తున్న ఆరోపణలన్నీ పూర్తిగా అవాస్తవాలు. గతంలో నా యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వీడియోలను తొలగించాలంటే రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. నేను డబ్బు ఇవ్వకపోవడంతోనే నాపై కక్షగట్టి ఇలాంటి నీచమైన ప్రచారానికి దిగారు" అని మంగ్లీ ఆరోపించారు.

**వివాదం నేపథ్యం ఇదే**

కొద్ది రోజుల క్రితం న్యాయవాది సుబ్బారావు, సింగర్ మంగ్లీ మైక్రో ఫైనాన్స్ పేరుతో అమాయక ప్రజల నుంచి సుమారు రూ.10 కోట్లు వసూలు చేసి మోసం చేశారని ఆరోపిస్తూ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా, ఈ విషయంపై మంగ్లీ, ఆమె సోదరులు తనను ఫోన్‌లో బెదిరించారని కూడా ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

**మంగ్లీ ఆవేదన**

మీడియా సమావేశంలో మాట్లాడిన మంగ్లీ, తనపై వస్తున్న ఆరోపణల కారణంగా తీవ్ర మానసిక క్షోభ అనుభవిస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. "ఎక్కడ చూసినా మంగ్లీ, మంగ్లీ అంటూ ఈ నెగెటివిటీని ఎందుకు ఇంత సెన్సేషనల్ చేస్తున్నారు? నా మంచి పనులను ఎవరూ గుర్తించరు. ఇదే పరిస్థితి మీ ఇంట్లో అక్కాచెల్లెళ్లకు ఎదురైతే మీరు తట్టుకోగలరా? చాలా మంది నాతో ఫోటోలు దిగుతారు. ఎవరో చేసిన తప్పులకు నన్ను బాధ్యురాలిని చేయడం ఎంతవరకు సమంజసం? మీడియా కుటుంబం నుంచే వచ్చిన నన్ను ఇలా వేధించడం సరికాదు" అని ప్రశ్నిస్తూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు.న్యాయవాది సుబ్బు కేవలం పాపులారిటీ కోసమే తన పేరును ఈ వివాదంలోకి లాగుతున్నారని మంగ్లీ ఆరోపించారు. "ఆయనకు ఫేమస్ అవ్వాలనే కోరిక ఉంది. వచ్చే ఏడాది బిగ్ బాస్‌కు వెళతానని, యాంకర్ శ్రీముఖి అంటే క్రష్ అని ఆయనే చెబుతున్నారు. అలాంటి వ్యక్తి ప్రచారం కోసం నాపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. నాతో మాట్లాడినప్పుడు కూడా ఆయన ప్రవర్తన సరిగా లేదు. దానికి సంబంధించిన వీడియో నా దగ్గర ఉంది" అని చెబుతూ దాన్ని మీడియాకు చూపించారు. ఆయన తనతో వల్గర్‌గా మాట్లాడారని, ఆకాశం నుంచి ఊడిపడ్డావా అంటూ అసభ్య పదజాలం వాడారని మండిపడ్డారు.ఈ కేసులో తన ప్రమేయం ఉందని నిరూపిస్తే ఎక్కడికి రమ్మన్నా రావడానికి సిద్ధమని మంగ్లీ సవాల్ విసిరారు. "నా ప్రమేయం లేదని తేలితే, ఆరోపణలు చేసిన సుబ్బును మీరేం చేస్తారో నాకు మాట ఇవ్వాలి" అని మీడియాను నిలదీశారు. తాను వృత్తిపరంగా ఎంతో బిజీగా ఉన్నానని, ఇటీవలే కర్ణాటకలోని శ్రీదత్త యూనివర్సిటీలో ప్రదర్శన ఇచ్చి వచ్చానని, తన ఇన్‌స్టాగ్రామ్ అప్‌డేట్స్ చూస్తే తన పని ఏంటో తెలుస్తుందని అన్నారు. అనవసర వివాదాలతో తన సమయాన్ని వృథా చేయొద్దని విజ్ఞప్తి చేశారు.

అదే సమయంలో, ఈ కేసులోని అసలైన బాధితులకు తాను అండగా ఉంటానని మంగ్లీ స్పష్టం చేశారు. "బాధితులకు పోలీస్ శాఖ తప్పకుండా న్యాయం చేయాలి. నేను కచ్చితంగా వారి పక్షాన నిలబడతాను. కానీ, సంబంధం లేకుండా నా పేరును లాగడం మాత్రం అన్యాయం" అని అన్నారు. ఇకపై ఈ విషయంపై తాము న్యాయపరంగానే ముందుకు వెళతామని, తన న్యాయవాది మిగిలిన విషయాలు చూసుకుంటారని ఆమె తేల్చిచెప్పారు.

## మేజర్ పంచాయితీ తాజంగి లో జిల్లాస్థాయి సమ్మర్ క్రికెట్ పోటీలు.




**చింతపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 12.** అల్లూరి సీతారామరాజు జిల్లా ,చింతపల్లి మండలం తాజంగి మేజర్ పంచాయితీ లో జిల్లాస్థాయి సమ్మర్ క్రికెట్ పోటీలు ప్రారంభించినట్లు నిర్వహణ కమిటీ తెలిపింది. ఆదివారం క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలను మాజీ సర్పంచులు పంతల మహేశ్వరి, దత్తును రామస్వామి, పెనుమల కాంతమ్మలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన యువత క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల వల్ల మానసిక శారీరక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడలను అత్యధిక ప్రతిభను కనబరిచినట్లయితే ప్రభుత్వ ఉద్యోగాలకు కూడా అర్హత సాధించే అవకాశం ఉందా అన్నారు. ఈ క్రీడలను జిల్లా స్థాయిలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 58 క్రీడా బృందాలు తలపడనున్నట్లు తెలిపారు. ప్రథమ స్థానం సొంతం చేసుకున్న క్రీడాకారులకు 20వేల నగదు మరియు జ్ఞాపిక, ద్వితీయ స్థానం క్రీడాకారులకు పదివేల రూపాయలు జ్ఞాపిక మెడల్స్ అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తలారి గంగాధర్ ,కొర్రా వికాస్ వర్మ ,మల్ల ముఖేష్ కుమార్ రీమల ఉదయ్ పాల్గొన్నారు.

# పెన్ పవర్
## ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# రోడ్డు ప్రమాద బాధితుడికి అండగా నిలిచిన జిల్లా కలక్టర్





- హోదాను మరిచి, ప్రోటోకాల్‌ను వీడి, తన కారులోనే క్షతగాత్రుడిని ఆసుపత్రికి చేర్చిన కలక్టర్
- మరపురాని మానవత్వంతో మనసున్న మహారాజు నిచిన కలక్టర్

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, పార్వతీపురం. ఏప్రిల్ 12:** జిల్లాకు అత్యున్నత అధికారి అంటే సాధారణంగా భారీ కాన్వాయ్, కట్టుదిట్టమైన భద్రత, ఎవరికీ అందనంత ఎత్తులో ఉండే హోదా.. ఇవే మనకు కనిపిస్తాయి. కానీ పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి వీటన్నింటికీ భిన్నమని, ఆయనకు పదవి కంటే ప్రజల కష్టనష్టాలపైనే దృష్టి ఉంటుందని నేడు రుజువైంది.

ఆదివారం తన అధికారిక పర్యటనలు ముగించుకుని తిరిగి వస్తుండగా, సీతానగరం మండలం చినభోగిలి సమీపంలో జరిగిన ప్రమాదం ఆయనలోని కరుణా హృదయాన్ని ఆవిష్కరించింది. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న బాధితుడిని చూసి కలెక్టర్ స్పందించిన తీరు, మన్యం జిల్లా చరిత్రలో ఒక సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుంది.

చినభోగిలి వద్ద ఒక వ్యక్తి బైక్ పై నుండి కిందపడి తీవ్ర గాయాలతో రోడ్డు పక్కన ప్రాణాపాయ స్థితిలో ఉండటాన్ని గమనించిన కలెక్టర్ క్షణం కూడా ఆలోచించకుండా తన కాన్వాయ్‌ను నిలపాలని ఆదేశించారు. ప్రమాదానికి గురైన వ్యక్తి బొబ్బిలి మండలం, కృష్ణరాయపురం గ్రామానికి చెందిన అజర్ శ్రీనివాసరావుగా గుర్తించగా తీవ్రమైన గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్న శ్రీనివాసరావును చూడగానే కలెక్టర్ చలించిపోయారు. సాధారణంగా ఇలాంటి సమయాల్లో అధికారులు ఫోన్ ద్వారా ఆదేశాలు ఇచ్చి వెళ్ళిపోతుంటారు. కానీ, కలెక్టర్ ప్రభాకరరెడ్డి మాత్రం స్వయంగా కారు దిగి, బాధితుడి వద్దకు వెళ్లి పరిస్థితిని గమనించారు. సమయం మించిపోతే ప్రాణం పోతుందన్న ఆవేదన చెంది, తన కారు పాడవుతుందనో, లేదా ప్రోటోకాల్ ఇబ్బందులు వస్తాయనో ఏమాత్రం ఆలోచించకుండా, ఆ సామాన్యుడిని తన కారులోనే ఎక్కించుకుని హాస్పిటల్ కు తరలించారు. బాధితుడు అజర్ శ్రీనివాసరావును ముందుగా సమీపంలోని సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ వైద్య సిబ్బందితో మాట్లాడి, స్వయంగా దగ్గరుండి ప్రాథమిక చికిత్స చేయించారు. అయితే బాధితుడి పరిస్థితి విషమంగా ఉందని, అపస్మారక స్థితి నుండి కోలుకోలేదని గుర్తించిన కలెక్టర్, అక్కడితో తన బాధ్యత తీరిపోయిందని అనుకోలేదు. మళ్ళీ అదే కారులో బాధితుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి, అక్కడ జాయిన్ చేసే వరకు ఆయన వెన్నంటే ఉన్నారు.

పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన తర్వాత ఒక జిల్లా కలెక్టర్ స్వయంగా ఒక రోడ్డు ప్రమాద బాధితుడిని తన కారులో ఎక్కించుకుని ఆసుపత్రికి తరలించడం ఇదే మొదటిసారి. జిల్లా గతిని మార్చే పాలనా నిర్ణయాలతోనే కాకుండా, ఇలాంటి అసాధారణ మానవతా దృక్పథంతో కూడా ఆయన ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారు. అధికార బలంతో కాకుండా, ప్రేమతో ప్రజలను ఎలా గెలుచుకోవచ్చో ఆయన నిరూపించారు. చుట్టుపక్కల ఉన్న జనం కలెక్టర్ గారి చొరవ చూసి ఆశ్చర్యపోవడమే కాకుండా, ఆయనలోని సేవా గుణానికి ఫిదా అయిపోయారు.

కలెక్టర్ అంటే పాలనలోనే కాదు.. ప్రాణాలను కాపాడటంలో కూడా ముందే ఉంటారు అంటూ జిల్లా వ్యాప్తంగా ఇప్పుడు ప్రభాకర రెడ్డి గారి పేరే మారుమోగిపోతోంది. అపస్మారక స్థితిలో ఉన్న కృష్ణరాయపురం వాసికి అపన్నహస్తం అందించి ప్రాణదాతగా నిలిచిన తీరు అద్భుతమని అందరూ కొనియాడుతున్నారు. సోషల్ మీడియా వేదికగా, బహిరంగంగా ప్రజలు ఆయనపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఒక ఉన్నత అధికారి ఇలాంటి ఉదాత్తమైన పని చేస్తే, అది సమాజంలోని అందరికీ గొప్ప స్ఫూర్తినిస్తుంది. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ఆయన చూపిన ఈ చొరవ ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని, ఇలాంటి కలెక్టర్ మా జిల్లాకు ఉండటం మా అదృష్టమని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.!

## పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం.



- కిమిడి నాగార్జున

**చీపురుపల్లి, పెన్ పవర్ ఏప్రిల్ 12 :** పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంకితభావంతో పనిచేసి, పార్టీ ప్రతిష్టకు కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సముచిత స్థానం కల్పిస్తున్నారని విజయనగరం జిల్లా టీడీపీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు.

ద్వారకా తిరుమల దేవస్థానం బోర్డు సభ్యురాలిగా నియామకమైన కింతాడ కళావతి నాగార్జునను ఆదివారం చీపురుపల్లిలో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాధ్యతలు అప్పగించడంపై నాగార్జున ను సత్కరించి,ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. దేవస్థానం అభివృద్ధి, భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించడం, సేవలను మరింత విస్తరించే దిశగా కృషి చేయాలని సూచించారు. గత ఐదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలను గుర్తించి వారికి తగిన ప్రాధాన్యత, పదవులు అందించడం జరుగుతోందన్నారు. పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేసిన వారిని ప్రోత్సహించడం చంద్రబాబు నాయుడు గారు ,లోకేష్ గారు నాయకత్వంలో కొనసాగుతోందని తెలిపారు. కింతాడ కళావతి మాట్లాడుతూ ఈ బాధ్యతను విశ్వాసంగా తీసుకుని, దేవస్థానం పురోగతికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పెందుర్తి, విశాఖ పశ్చిమ జోన్లో భారీ అవినీతి అనుకొండ!



- అక్రమ యూసీలపై ఏసిపి రామలింగేశ్వరరెడ్డి కీలక సూత్రధారుడు!
- డీల్ కుదిరితే.. అక్రమ యూసి నైనా దర్జాగా కట్టుకోవచ్చు!
- ధర ఫిక్స్ అయ్యిందా..నో యాక్షన్? నో డెమోలిషన్!
- అక్రమ అనాథరైజ్డ్ (యూసి) నిర్మాణాలనుండి రూ. కోట్లు దోపిడీ!
- జోన్లు విభజన తర్వాత కో కోలల్లగా అక్రమ యూసీలు నిర్మాణాలు!
- రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలన్న డిమాండ్!

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఏప్రిల్ 12 :** గ్రేటర్ విశాఖ నగర పరిధిలోని పెందుర్తి, పశ్చిమ జోన్లో టౌన్ ప్లానింగ్ విభాగం చుట్టూ తీవ్రమైన వివాదం నెలకొంది. జోన్లు విభజన తర్వాత పెందుర్తి, విశాఖ పశ్చిమ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు, అదనపు అంతస్తులు విపరీతంగా పెరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అనాథరైజ్డ్ కన్స్ట్రక్షన్లో పెందుర్తి జోన్ ఇన్చార్జ్ ఏసిపి, విశాఖ పశ్చిమ జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ రామలింగేశ్వరరెడ్డి కీలక సూత్రధారుడని, ఆయన పనితీరుపై తీవ్ర సందేహాలు, అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. స్థానికుల వాదన ప్రకారం, అనుమతులు లేకుండా భారీ యూసీలు (అనాథరైజ్డ్ కన్స్ట్రక్షన్లు) నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ, అధికారుల చర్యలు బిల్డర్లు ఇచ్చిన లక్షల్లో ఎంపికచేసిన విధంగా ఉన్నాయని, “డీల్ కుదిరితే నో యాక్షన్, లేకపోతే కూల్చివేతలు” అనే ఆరోపణలు ప్రజల్లో బలంగా వినిపిస్తున్నాయి. అనధికార, అనాధరైజుడ్ కన్స్ట్రక్షన్స్, (యూసి) నిర్మాణాలకు, సంబంధించి రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ముడుపులు తీసుకుంటున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. అయితే, ఈ లావాదేవీలపై ప్రత్యక్షంగా..పరోక్షంగా బయటకు రాకుండా “చాప కింద నీరులా” ఈ వ్యవహారాన్ని గుట్టుగా జరుపుతున్నారు. ముడుపులు తీసుకోవడంలో అధికారిక ధృవీకరణ, లేకపోయినా అక్రమ యూసీల్లో రూ. కోట్లు దండుకుంటున్నారని, ఈ మధ్య గ్రేటర్ విశాఖ పరిధిలో ఒక్క బిల్డర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.



ఈ మూడు బిల్డింగ్‌లు అక్రమ యూసీలే..వీటిని ఎందుకు ఏసిపి కూల్చలేదో చెప్పాలి

జోన్ 8 నుంచి విశాఖ పశ్చిమ, పెందుర్తి జోన్లు వేరు అయిన తర్వాత, కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఏసీపీ రామలింగేశ్వరరెడ్డి అధికారుల కాలంలో అనధికార నిర్మాణాలు పెరిగాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇది కేవలం యాదృచ్ఛికం కాదని, వ్యవస్థలో లోపాలను అవకాశంగా ఉపయోగించుకుంటూ నేనే రాజు.. నేనే మంత్రనే.. గర్వంతో ఇష్టారాజ్యంగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. గాజువాక ప్రాంతంలో పనిచేసిన సమయంలో కూడా ఇదే అధికారిపై విజిలెన్స్ విచారణలు జరిగాయనే ఆరోపణలున్నాయి. మంగళగిరి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లినా, ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు తీసుకున్నట్లు సమాచారం లేదు. “పెన్ పవర్” తోపాటు కొన్ని మీడియాల్లో కథనాలు బయటకు వచ్చినప్పటికీ, వాటిపై అధికారికంగా ఎటువంటి స్పందన లేకపోవడం మరింత అనుమానాలకు తావిస్తోంది. ప్రజలు సమాచారాన్ని వాట్సాప్ గ్రూపుల ద్వారా అధికారులకు పంపించినా, స్పందన రాకపోవడం ప్రశ్నార్థకంగా మారింది.

పెందుర్తి జోన్ సచివాలయం 497, 517లో రెండు యూసీలు మరియు పెందుర్తి పోలీస్ స్టేషన్ డౌన్లో సర్వే నెం.123/2 ప్లాన్ షార్ట్ ఫాల్ ఉన్నప్పటికీ దీనిపై చర్యలు తీసుకోకుండా ఇష్టారాజ్యం కట్టేస్తున్నాడు. అంతేకాకుండా సింహాచలం రోడ్డు, గొల్ల నారాయణపురం, బృందావన్ లాడ్జి వెనుక నిర్మిస్తున్న అక్రమ యుసిని నిర్మించిన మరుసటిరోజే తన సిబ్బందితో హుటాహుటున బిల్డింగులు కూల్చి వేశారు. అదే పైన ఉదాహరించిన రెండు అనాధరైజుడు(యూసీ)లు, షార్ట్ ఫాల్లో ఉన్న బిల్డింగు కలుపుకొని 3 బిల్డింగులపై చర్యలు చర్యలు తీసుకోకుండా ఉదాసీనతో వ్యవహరించడంపై మూడు బిల్డింగుల నుంచి సుమారు రూ.20 లక్షల వరకు వసూళ్లు చేశారని, అందువలనే పేపర్లు ఎన్ని వార్తలు వచ్చిన వాటి జోలికి పోకుండా ఉదాసీనత తో వ్యవహరిస్తున్నారని, గొల్ల నారాయణపురంలో అక్రమ యుసి వేసిన వెంటనే కూల్పించిన ఏసిపి రామలింగేశ్వరరెడ్డికి ఈ బిల్డింగ్ వ్యవహారంలో ముడుపులు అందలేదనే నెపంతో కూల్చారని స్థానికులు విమర్శిస్తున్నారు.

ఈ పరిణామాల నేపథ్యంలో, పెందుర్తి, పశ్చిమ జోన్ 8 టౌన్ ప్లానింగ్ వ్యవహారాలపై సమగ్ర విచారణ జరపాలనే డిమాండ్ పెరుగుతోంది. ఆరోపణలు నిజమైతే కఠిన చర్యలు తప్పవు. అదే సమయంలో, అవి నిరాధారమైతే ప్రజలకు నిజాలు తెలియజేయాల్సిన బాధ్యత కూడా అధికారులదే. పట్టణ ప్రణాళికలో పారదర్శకత లేకపోతే, అక్రమ నిర్మాణాలు నగర భవిష్యత్తును దెబ్బతీసే ప్రమాదం ఉంది. యూసీల ఘటనలను తేల్చాల్సిన సమయం ఆసన్నమైంది. నగరంలో జోన్ల విభజన తర్వాత అక్రమంగా యూసీ నిర్మాణాలు పెరిగిపోతున్నాయని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నియంత్రణ లేకుండా సాగుతున్న ఈ నిర్మాణాలు అధికార వ్యవస్థలో అవినీతి వాసనను స్పష్టంగా చూపిస్తున్నాయని, మున్సిపల్ పరిపాలనలో జోన్ల విభజన చేపట్టిన తర్వాత, నియంత్రణ వ్యవస్థ బలహీనపడిందని తెలుస్తోంది. దీనిని ఆసరాగా చేసుకుని కొంతమంది నిర్మాణదారులు అనుమతులు లేకుండా భారీ భవనాలు నిర్మిస్తున్నారని సమాచారం. ప్రతి జోన్‌లో అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ఈ అక్రమ నిర్మాణాలు “కోకోల్లలా” పెరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. అక్రమ యూసీ నిర్మాణాల అనుమతుల కోసం కోట్ల రూపాయల దోపిడీ జరుగుతున్నట్టు స్థానిక వర్గాలు చెబుతున్నాయి. ఒక్కో నిర్మాణానికి సంబంధించి భారీగా లంచాలు తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో మధ్యవర్తుల పాత్ర కూడా కీలకంగా ఉందని సమాచారం. ఈ అక్రమ వ్యవహారంలో ఏసీపీ, డీసీపీ, సీసీపీ స్థాయి అధికారుల పాత్ర ఉందనే ఆరోపణలు తీవ్రంగా చర్చనీయాంశంగా మారాయి. నియంత్రణ బాధ్యతలు నిర్వహించాల్సిన అధికారులు తామే ఈ వ్యవహారాల్లో ప్రమేయం కలిగి ఉన్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలు భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశముందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అలాగే పట్టణ ప్రణాళిక కూడా పూర్తిగా దెబ్బతింటోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలను గుర్తించి కూల్చివేయడమే కాకుండా, అవినీతి అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు!



సింహాచలం రోడ్‌లో బృందావనం లాడ్జి వెనుక అక్రమ యూసీ అని కూల్చిన బిల్డింగ్

## వంగపల్లి పేటలో భక్తిశ్రద్ధలతో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ శంకుస్థాపన - పాల్గొన్న యువనేత కిమిడి రామ్ మాలిక్ నాయుడు



**చీపురుపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 12:** చీపురుపల్లిమండల పరిధిలోని వంగపల్లి పేట గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ శంకుస్థాపన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, యువనేత కిమిడి రామ్ మాలిక్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని, శాస్త్రోక్తంగా జరిగిన పూజా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు.గ్రామస్తులు మరియు ఆలయ కమిటీఆహ్వానం మేరకు విచ్చేసిన రామ్ మాలిక్ నాయుడు కి గ్రామ పెద్దలు, మహిళలు ఘనస్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆయన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా రామ్ మాలిక్ నాయుడు మాట్లాడుతూ:

"గ్రామాల్లో ఆధ్యాత్మిక చింతన పెరగడం వల్ల ప్రశాంతత నెలకొంటుంది. అమ్మవారి ఆశీస్సులు వంగపల్లి పేట గ్రామ ప్రజలందరిపై ఉండి, అందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నాను. ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, గ్రామస్తులందరూ ఐకమత్యంతో ఈ నిర్మాణాన్ని పూర్తి చేయాలని" ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో చీపురుపల్లి తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు రౌతు కాము నాయుడు, ఆర్ఇసి ఎస్ మాజీ చైర్మన్ దన్నాన రామచంద్రుడు, శ్రీ కనకమాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, వంగపల్లి పేట తెలుగుదేశం నాయకులు వెంపడాపు లక్ష్మనాయుడు,స్థానిక టిడిపి నాయకులు,కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి మండల కేంద్రంలో సోమవారం 'మీ కోసం' కార్యక్రమం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 12:**జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గూడెం కొత్త వీధి మండలంలో ప్రజల అర్జీల స్వీకరణ కోసం సోమవారం మండల కేంద్రంలో 'మీ కోసం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ హెచ్.అన్నాజీ రావు తెలిపారు. మండలానికి చెందిన ప్రజలు తమ సమస్యలు, వినతిపత్రాలను ఈ కార్యక్రమంలో నేరుగా సమర్పించవచ్చని సూచించారు. పాడేరు కేంద్రానికి వెళ్లి వ్యయప్రయాసలు పడకుండా, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమం సందర్భంగా అన్ని శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల అర్జీలను స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపడతారని తెలిపారు.

## వడదెబ్బ తో మహిళ మృతి



**కురుపాం, పెన్ పవర్,ఏప్రిల్ 12:** కురుపాంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మొండి కాంతమ్మ (68) అనే మహిళ వడదెబ్బతో మృతి చెందింది.కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మధ్యాహ్నం రోజువారీ కూలి పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న క్రమంలో ఆమె ఒక్కసారిగా స్పృహ కోల్పోయి రోడ్డు పక్కన పడిపోయింది. విషయం గమనించిన స్థానికులు వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వడదెబ్బ కారణంగా మహిళ మృతి చెందడంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. మృతురాలికి భర్తతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. అధికారులు తక్షణమే అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, గ్రామంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. తీవ్ర ఎండల సమయంలో బయటకు వెళ్లే సమయంలో నీరు తీసుకెళ్లడం, మధ్యాహ్న వేళల్లో పనులను తగ్గించడం వంటి జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

## శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ తల్లి పండుగ సందర్భంగా మోదకొండమ్మ తల్లికి మంగళ స్నానం.





**హుకుంపేట పెన్ పవర్ ఏప్రిల్ 12.**అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం హుకుంపేట గ్రామంలో మే 3,4,5,తేదీలలో జరిగే శ్రీ శ్రీ శ్రీ మోదకొండమ్మ తల్లి జాతర మహోత్సవాలు సందర్భంగా అమ్మవారికి 108 బిందెల మంగస్థానం చేయించడం జరిగినది అని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలుఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడ శ్రీ శ్రీ శ్రీ మోద కొండమ్మ తల్లి పండగ ఉత్సవాలు జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హుకుంపేట మండల పేసా ప్రధాన కార్యదర్శి జన్ని.వెంకటరమణ విచ్చేశారు అలాగే ఉత్సవ కమిటీ అధ్యక్షులు కొర్ర. నాగబాబు, ఉపాధ్యక్షులు శోభ. సంతోష్ కుమార్,కోశాధికారి నైని. సత్తిబాబు,సిరగం సూర్యకాంతం, ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి ఒలుగు వాసుదేవరావు, స్థానిక ఎంపిటిసి కొమ్ము.రమ్మ, స్థానిక మాజీ సర్పంచ్ వెంకట పూర్ణిమ్మ,హుకుంపేట మండల పీసా అధ్యక్షులు చప్పలి శంకరరావు,హుకుంపేట మండల ప్రధానకార్యదర్శిజన్ని.వెంకటరణ జాయింట్ సెక్రటరీ శెట్టి.జయరాం కుమార్, పీసా కమిటీ సభ్యులు కొన్నోడి వెంకట్, టిడిపిగ్రామకంఠఅధ్యక్షులు డల్లై.లక్ష్మన్, కొండపల్లి సూరిబాబు, జన్ని.అప్పారావు,,బద్నాయిని శివ బాలు, శోభ. రామ్ లక్ష్మణ్ బ్రదర్స్, ఏమో ప్రకాష్, పార్థివ్ నాయుడు వందలి. విశ్వనాథం, మోహన్ శ్యాం , గ్రామస్తులు మహిళలు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

## విశాఖలో ఆధునిక వైద్య సదుపాయాల విస్తరణ





ప్రజలకు కార్పొరేట్ స్థాయి సేవలు లక్ష్యం

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 12** :ప్రజా ఆరోగ్య పరిరక్షణను ప్రధాన లక్ష్యంగా తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను చేరువ చేయడమే ప్రభుత్వ ధ్యేయమ ని ఆయన స్పష్టం చేశారు.ఆదివారం విశాఖ పట్నంలోని చెస్ట్ అండ్ కమ్యూనికబుల్ డిసీజెస్ ఆసుపత్రిలో ఎండో బ్రాంకియల్ అల్ట్రాసౌండ్ (ఇబుస్) యంత్రంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారిగా ఈ సాంకేతికతను ప్రవే శపెట్టడం విశేషమని, దీని ద్వారా ఊపిరితి త్తుల వ్యాధుల నిర్ధారణ మరింత సులభం అవుతుందని మంత్రి తెలిపారు.గత రెండేళ్లలో రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు గణనీయంగా పెరిగాయని ఆయన పేర్కొన్నారు. చెస్ట్ ఆసుపత్రిలో ఓపి సేవలు 2023లో 35 వేల నుంచి 2025 నాటికి 45 వేలకి పెరిగాయని, మే జర్ సర్జరీలు 359 నుంచి 649కి పెరగడం వైద్యు ల అంకితభావానికి నిదర్శనమని అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం దేశంలోనే మొదటిసారిగా అమలు చేస్తున్నామని తెలిపారు. కర్నూలు, విశాఖప ట్నం, కడప, గుంటూరు ప్రాంతాల్లో అత్యాధునిక క్యాన్సర్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడిం చారు. త్వరలో కాకినాడ, అనంతపురంలో కూ డా కాంప్రహెన్సివ్ క్యాన్సర్ సెంటర్లు పూర్తి చే యనున్నట్లు చెప్పారు.ఆరోగ్యశ్రీ ఎన్టీఆర్ వైద్య సేవ) పథకం కింద నిధులను భారీగా పెంచినట్లు మంత్రి పేర్కొన్నారు. గతంలో రూ.6 లక్షలుగా ఉన్న చికిత్స పరిమితిని ప్రస్తుతం రూ.3.76 కోట్ల వరకు పెంచడం ద్వారా ప్రజలకు మరింత భరోసా కల్పించామని అన్నారు. అలాగే రాష్ట్రం లో డయాలసిస్ యంత్రాల సంఖ్యను 550 నుం చి 725కు పెంచినట్లు తెలిపారు.త్వరలో ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందించే యూనివర్సల్ హెల్త్ స్కీమ్‌ను అమలు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇంత పెద్ద స్థాయిలో ఉచిత వైద్యం అందిస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తోందని పేర్కొ న్నారు.జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడు తూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక సాంకేతిక సదుపాయాలు అందుబాటులోకి రావడం సంతోషకరమని అన్నారు. ఈ పరికరాల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతాయ ని తెలిపారు. వైద్య రంగ అభివృద్ధిలో విశాఖప ట్నం ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లు త్వరలో ఎన్నికల నుంచే అమలు లక్ష్యం




మంత్రి సత్యకుమార్ యాదవ్

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 12** :మహిళల రాజకీయ సాధికారతకు కేంద్ర ప్రభు త్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మం త్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. భారతీ య జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎం. ఎన్ పరుశురామరాజు అధ్యక్షత వహించారు.

'నారి శక్తి వందనం' పేరుతో మహిళలకు చట్టస భల్లో ప్రాధాన్యత కల్పించే బిల్లును ప్రవేశపెట్టను న్నట్లు మంత్రి తెలిపారు. ఏప్రిల్ 17, 18 తేదీల్లో పార్లమెంట్‌లో దీనిపై చర్చ జరిగే అవకాశం ఉందన్నారు. దేశంలో మహిళలు సుమారు 50 శాతం ఉన్నప్పటికీ, చట్టసభల్లో వారికి కేవలం 13 శాతం మాత్రమే ప్రాతినిధ్యం ఉందని గుర్తు చేశారు.స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్ ఇవ్వడంతో మహిళలు తమ ప్రతిభను నిరూపిం చుకున్నారని చెప్పారు. జనధన్ ఖాతాలు, స్టాండ్ అప్ ఇండియా, స్టార్ట్ అప్ ఇండియా వంటి పథకాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడినట్లు వివరించారు. మహిళా సాధికార త మాటల్లో కాకుండా కార్యాచరణలో చూపిం చాలనే లక్ష్యంతో ఎన్డీయే కూటమి పనిచేస్తోంద ని తెలిపారు.మహిళా రిజర్వేషన్ బిల్లు పార్ల మెంట్‌లో ఆమోదం పొందాలని ఆకాంక్షిస్తూ, వచ్చే ఎన్నికల నుంచే అమలు చేసే దిశగా చర్య లు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

ఇదే సందర్భంగా ప్రతిపక్షాలపై మంత్రి విమర్శలు గుప్పించారు. ప్రజలు తిరస్కరించిన నేతలు విమర్శలు చేయడం తగదన్నారు. వంద సీట్లు కూడా దాటలేని కాంగ్రెస్ వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని అన్నారు. రాష్ట్రంలో పెట్టుబ డుల విషయంలో వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. భోగాపురం అభివృద్ధి ని గత ఐదేళ్లుగా నిర్లక్ష్యం చేసి ఇప్పుడు తమదే అని చెప్పడం విడ్డూరమన్నారు.

దేశవ్యాప్తంగా రాజకీయ పరిస్థితులపై కూడా ఆయన వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడులో పాలన మార్పు అవసరమని పేర్కొన్నారు. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో తెలుగు ప్రజలు ఉన్న చోట కూటమి అగ్రనేతలు ప్రచారం చేస్తారని తెలిపారు.

ఈ సమావేశంలో బీజేపీ శాసనసభ పక్ష నేత పి. విష్ణుకుమార్ రాజు, టిడిపి జిల్లా అధ్యక్షుడు సిహెచ్ పట్టాభి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సుజాత రాజ్, బీజేపీ మహిళా అధ్యక్షురాలు ఎన్ జ్యోతి, టిడిపి మహిళా అధ్యక్షురాలు అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుని కుటుంబాన్ని పరామర్శించిన ప్రభుత్వ విప్.



**గుమ్మలక్ష్మీపురం ఏప్రిల్ 12 పెన్ పవర్.**జియ్యమ్మవలస మండలం,శిఖబడి గ్రామానికి చెందిన దాసర రామారావు(అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు)సోదరులు దాసర వాసుదేవరావు(నీటి సంఘం ప్రెసిడెంట్)అనారోగ్యంతో మృతి చెందారు.విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ మరియు కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆదివారం నాడు ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి,ఓదార్చారు.ఈ సందర్భంగా వాసుదేవరావు కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన వారిని కోల్పోవడం బాధాకరమని ఎమ్మెల్యే గారు పేర్కొంటూ,తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములుగా ఉంటామని,ఎలాంటి పరిస్థితుల్లోనైనా ప్రజలకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.ఎమ్మెల్యే వెంట ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డొంకాడ రామకృష్ణ,ఎంపీపీ బొంగు సురేష్,నాయకులు శ్రీరామూర్తి నాయుడు,శివ,సోములు ఉపాధ్యాయులు స్థానిక కూటమి నాయకులు,కార్యకర్తలు,తదితరులు ఉన్నారు.

## ప్రొడక్షన్ నెంబర్ 1 లో సినిమా షూటింగ్ ప్రారంభం






**గాజువాక :పెన్ పవర్ ,ఏప్రిల్ 12**

ఆర్ జి క్రియేషన్స్ వారి ప్రొడక్షన్ నెంబర్ 1 లో సినిమా షూటింగ్ గాజువాక స్థానిక గోపాలరెడ్డి నగర,గాజువాక లో గల స్వయంభూ శ్రీ దుర్గాంబిక ఆలయం లోమోదలైంది. ఇ చిత్రానికి డైరెక్టర్ రాము గుడివాడ సినిమా విశేషాల గురించి వివరించారు. గతంలో మొదలై కొన్ని కారణాల వలన సినిమా ఆలస్యం జరిగిందని, మరలా నూతన నటీనటులతో షూటింగ్ ప్రారంభించడం జరిగిందని,షూటింగ్ మొత్తం సింగిల్ షెడ్యూల్ లో పూర్తవుతుందని,యారాడ, మల్కాపురం,గాజువాక, రుషికొండ,పెందుర్తి పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుగుతుందని,ఇప్పటికే పాటలు,కొన్ని సన్నివేసాలు చిత్రీకరించమని డైరెక్టర్ రాము గుడివాడ వివరించారు. ఈ సినిమా కి కథ, స్క్రీన్ స్క్రీన్ ప్లే,మాటలు,పాటలు,సంగీతం,దర్శకత్వం తానే నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ రాము గుడివాడ తెలిపారు. ఈ సినిమా కి నిర్మాతలు గా విజయ్ జూపూడి,చక్రవర్తి, కో - డైరెక్ ప్రసాద్ , డి ఓ పి మూర్తి, డాన్స్ మాస్టర్ గా సంతోష్ చేస్తున్నారని డైరెక్టర్ రాము గుడివాడ వివరించారు.

ఈ కార్యక్రమంలో విశాఖ గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణు , అసిస్టెంట్ డైరెక్టర్లు అర్జున్,ఈశ్వర్, వై.బాలు, మురళి మరియు కొంతమంది సీనియర్ న్యాయవాదులు,పాత్రికేయులు పాల్గొని, సినిమా విజయం సాధించాలని కోరారు.

## శ్రావణ నక్షత్రం సందర్భంగా వేంకటేశ్వర స్వామికి మహాభిషేకం



**గాజువాక: :పెన్ పవర్ ,ఏప్రిల్ 12**

జీవీఎంసీ 65వ వార్డు బానోజీ తోట వంబే కాలనీ గరుడాద్రి కొండపై వెలసిన వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణి నక్షత్రం స్వామివారు జన్మ నక్షత్రం సందర్భంగా స్వామివారికి మహాభిషేకం ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, ఆలయ చైర్మన్ నేతృత్వంలో వైభవముగా వేద పండితులు ఆలయ ప్రధాన అర్చకులు ఉష శ్రీనివాసచార్యులు, విజయ నాయక్ చే ప్రత్యేక కలంకరణ చేసి మహా అభిషేకం నిర్వహించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఉత్తర ద్వారంలో ఉత్తరాంధ్రలో వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయం రెండవది. స్వామివారిని ఏడు వారాలు ముడుపులు కట్టి పూజలు చేసినవారికి స్వామివారి కృపా కటాక్షాలు ఉంటాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ జరిగినది.వీక్షించిన భక్తులకు ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుని కోరుతున్నామని నిర్వాహకులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ సేవకులు ఆలయ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెంటకోట రాజు, జీవన్ జ్యోతి అప్పారావు దంపతులు,బి.వెంకటేష్, మరియు ఆలయ సేవకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మండల కేంద్రాల్లో ప్రతి సోమవారం 'గ్రీవెన్స్ డే' తప్పనిసరి:జిల్లా కలెక్టర్ నిశాంతి






**అధికారులందరూ హాజరు కావాలి**



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్, ఏప్రిల్ 12:** ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ప్రతి సోమవారం మండల కేంద్రాల్లో 'మీ కోసం గ్రీవెన్స్ డే' కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ టి. నిశాంతి సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఆదివారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ తిరుమని శ్రీపూజ, ఐటిడిఏ పీఓ ఆదిత్య వర్మ, ఆర్డీవో ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు, డిఆర్వో నీలకంఠరావు తదితరులతో కలిసి కలెక్టర్ మాట్లాడారు.ఈ సందర్భంగా కార్యక్రమం నిర్వహణపై పలు కీలక సూచనలు చేశారు.ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డేకు తహసీల్దార్లు, ఎంపీడీవోలతో పాటు మండల స్థాయి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. అగ్రికల్చర్, ఇంజనీరింగ్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రైబల్ వెల్ఫేర్, ఐసిడిఎస్, హౌసింగ్, డీఆర్డీఏ వంటి శాఖల అధికారులు పాల్గొనాలని స్పష్టం చేశారు. గ్రీవెన్స్ కార్యక్రమం సక్రమంగా జరుగుతుందో లేదో జాయింట్ కలెక్టర్ పర్యవేక్షించాలని, డిఆర్వో సహకరించాలని తెలిపారు. ప్రతి మండలంలో హాజరైన, గైర్హాజరైన అధికారుల వివరాలతో అటెండెన్స్ నివేదికను వెంటనే కలెక్టరేట్‌కు పంపాలని ఆదేశించారు.ప్రజల నుంచి వచ్చే వినతులను సంబంధిత శాఖల లాగిన్‌లలో నమోదు చేసి, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అధికారులందరూ నవోత్సాహంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఇక గ్రామ స్థాయిలో ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం కల్పించాలని, ఎంపీడీవోలు, తహసీల్దార్లు టామ్‌టామ్ ద్వారా ప్రజలకు సమాచారం చేరవేయాలని ఆదేశించారు.ఈ ఆదేశాలను ఉల్లంఘించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా స్థాయి అధికారులు, మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## సృష్టి క్షేత్ర నిర్మాణం నిరాటంకంగా సాగాలి

**నూకాంబికా ఆలయంలో ప్రత్యేక పూజలు**



**నర్సీపట్నం, పెన్ పవర్ (ఏప్రెల్ 12) :** స్థానిక పెద్ద చెరువులో సృష్టిక్షేత్రం పేరిట తలపెట్టిన 108 అడుగుల శివపార్వతుల విగ్రహం ఏర్పాటుకు ఎదురవుతున్న ఆటంకాలు తొలగిపోవాలని కోరుతూ శ్రీ నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎపి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సంకల్పంతో నర్సీపట్నం ప్రాంతాన్ని ఒక గొప్ప ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఈ బృహత్తర ప్రాజెక్టును చేపట్టారు. ఈ క్రమంలో ఎటువంటి అడ్డంకులు కలగకూడదనే ఉద్దేశంతో దేవస్థానం చైర్మన్ కొరుప్రోలు శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులు, టీడీపీ నాయకులు డప్పు వాయిద్యాల నడుమ పసుపు నీళ్ల బిందెలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి పాలాభిషేకాలు, కుంకుమ పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

?ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సృష్టి క్షేత్రం వంటి పవిత్రమైన కార్యక్రమానికి వైసిపి నాయకులు దుష్ట శక్తుల్లా అడ్డుతగులుతున్నారని విమర్శించారు. 108 అడుగుల భారీ విగ్రహాల ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతం ఆధ్యాత్మికంగానే కాకుండా పర్యాటక రంగాన్ని కూడా అభివృద్ధి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో నూకాంబిక అమ్మవారి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయలేకపోయిందని, కానీ అయ్యన్నపాత్రుడు చొరవతో కేవలం ఆరు నెలల్లోనే పనులు పూర్తయ్యాయని గుర్తు చేశారు. స్థానిక ఆచారాల పట్ల అవగాహన లేని వారు ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఈ అడ్డంకులన్నీ తొలగి క్షేత్ర నిర్మాణం సత్వరం పూర్తి కావాలని ఆకాంక్షిస్తూ అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ శ్రేణులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పేదలకు శుభవార్త: తక్కువ ధరల్లో ఆధునిక వైద్య పరీక్షలు





**విశాఖలో నూతన డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభం**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 12 :**పేద మరియు మధ్య తరగతి ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య పరీక్షలను అందించా లనే లక్ష్యంతో విశాఖపట్నంలో నూతన ఆధునిక డయాగ్నోస్టిక్ సెంటర్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రారంభిం చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ప్రజలకు మరింత చేరువలో ఆరోగ్య సేవలను అందించనుంది.జిల్లా పరిషత్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ఆది వారం మంత్రి ప్రారంభిస్తూ మాట్లాడుతూ, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద గెయిల్ సంస్థ సహకారంతో ఏర్పాటైన ఈ సదుపాయం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. రక్తదాన సేవల ద్వారా ఇప్పటికే వేలాది ప్రాణా లను కాపాడుతున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసై టీ, ఇప్పుడు ఆధునిక వైద్య పరీక్షలను కూడా అందుబాటులోకి తీసుకురావడం అభినందనీ యమన్నారు.తలసేమియా బాధితులకు నిరం తరం రక్తం అందిస్తూ సేవలందిస్తున్న ఈ సంస్థ, ఇప్పుడు డయాగ్నోస్టిక్ సేవలను విస్తరించడం ఉత్తరాంధ్ర ప్రజలకు పెద్ద ఉపశమనమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో సమగ్ర మార్పులు తీసుకువస్తూ ప్రజలకు మెరు గైన ఆరోగ్య సేవలు అందించేందుకు కట్టుబడి ఉందన్నారు.ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వై.డి. రామారావు మాట్లాడుతూ, కొత్త పరికరాలతో థైరాయిడ్, సంతానోత్పత్తి సమస్య లు, క్యాన్సర్ స్క్రీనింగ్, హెపటైటిస్ వంటి అం టువ్యాధుల నిర్ధారణ పరీక్షలు, గుండె సంబంధి త ఈసీజీ, ట్రెడ్‌మిల్ పరీక్షలు, లివర్ మరియు మూత్రపిండాల పనితీరు పరీక్షలు, రక్తంలో చక్కె ర స్థాయి పరీక్షలు, అల్ట్రాసౌండ్ వంటి సేవలను ఖచ్చితత్వంతో, తక్కువ ధరల్లో అందించను న్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ విశాఖ జిల్లా చైర్మన్ సి. బాల సతీష్, వైస్ చైర్మన్ మురళీకృష్ణ పట్నాయక్, ట్రెజరర్ గుడివాడ ప్రసాదరావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నరవ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ పశ్చిమంలో 'సూర్యఘర్ యోజన ఉత్సవ్' ప్రారంభం





**ప్రజలకు సోలార్ పై అవగాహన కల్పన**

**ములగాడ, పెన్ పవర్,ఏప్రిల్ 12 :**కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిష్టాత్మక పథకం అయిన 'ప్రధానమంత్రి ఎస్సీ, ఎస్టీ సూర్యఘర్ యోజన'పై అవగాహన పెంపొందించేందుకు ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ జోన్-2 ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమా లు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఏప్రిల్ 5 నుండి 14 వరకు 'సూర్యఘర్ యోజన ఉత్సవ్' ను నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమాన్ని విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని మల్కాపురంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు గణబాబు ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, వర్గాలకు చెందిన ప్రజలకు సౌర విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించడం ఈ కార్య క్రమం ప్రధాన లక్ష్యమన్నారు. 'పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' ద్వారా అందించే సబ్సి డీలు, ప్రయోజనాలను ప్రతి ఇంటికి చేర్చే దిశగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను వినియోగించుకొని తమ ఇళ్లపై సోలార్ ప్యానె ల్స్ ఏర్పాటు చేసుకుని విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఉచిత విద్యుత్ లక్ష్యాన్ని సాధించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ముఖ్యంగా ఏపీ ఈ పి డి సి ఎల్ చీఫ్ ఇంజనీర్ శ్యామ్ బాబు, ఈఈ నాయుడు, ఏడి, ఏఈలు, మజ్జి సోమేష్, ఎన్. జోగి, సర్వ సిద్ధి లక్ష్మి తదితరులు హాజరయ్యారు.


## ద్విచక్ర వాహన ప్రమాదం యువకునికి తీవ్ర గాయాలు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఏప్రిల్ 12:**మండలంలోని ఏబులం చిలకవీధి దేవరపల్లి మధ్య ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.దారకొండ పంచాయితీ నేలజర్త గ్రామానికి చెందిన సాగిన ధార ప్రసాద్ ద్విచక్ర వాహనంపై దేవరపల్లి వైపు వెళుతుండగా మార్గమధ్యంలో వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో దార ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు.సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఈఎంటీ రాజు, పైలట్ రెహమాన్ గాయపడిన దార ప్రసాద్ కు చింతపల్లి ప్రాంతీయ ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్ కు తరలించారు.

## సింహాచలం ఆలయంలో దర్శన సమయాల్లో మార్పులు

- కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం సందర్భంగా భక్తులకు సూచనలు
- శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవో



**సింహాచలం, పెన్ పవర్, ఏప్రిల్ 12 :** సింహాచల పుణ్యక్షేత్రం, శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో అత్యంత పవిత్రమైన "కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం" సేవ నిర్వహణ సందర్భంగా ఈ నెల 14వ తేదీ (మంగళవారం) నాడు స్వామివారి దర్శన సమయాల్లో మార్పులు చేసినట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. ఆధ్యాత్మిక సంప్రదాయం ప్రకారం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని "కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం"గా వ్యవహరిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భగుడి నుంచి ఆస్థాన మండపం వరకు ఆలయ ప్రాంగణమంతటిని సంప్రదాయబద్ధంగా శుద్ధి చేస్తారు. ఆలయాన్ని పవిత్రతతో నింపే ఈ విశిష్ట కార్యక్రమానికి విశేష ప్రాధాన్యం ఉంది. ఈ నేపథ్యంలో, మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు స్వామివారి సర్వదర్శనాలను పూర్తిగా నిలిపివేయనున్నారు. తదుపరి రోజు నుండి దర్శనాలు యథావిధిగా కొనసాగుతాయని దేవస్థాన అధికారులు తెలిపారు. దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు, స్థానికులు ఈ మార్పులను గమనించి తమ ప్రయాణాలను ప్రణాళిక చేసుకోవాలని, ఆలయ సిబ్బందికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# గోపాలపట్నం పోలీసుల చాకచక్యం

**తప్పిపోయిన బాలుడు, యువతి సురక్షితంగా గుర్తింపు**

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఏప్రిల్ 12 :** స్థానిక విశాఖపట్నం నియోజకవర్గం, గోపాలపట్నం పోలీసుల సమయస్ఫూర్తి, చురుకుదనం వల్ల రెండు వేర్వేరు మిస్సింగ్ కేసుల్లో తప్పిపోయిన బాలుడు మరియు యువతిని సురక్షితంగా గుర్తించి వారి బంధువులకు అప్పగించారు.

గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో నమోదైన బాయ్ మిస్సింగ్ మరియు ఉమన్ మిస్సింగ్ కేసులను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. దర్యాప్తు భాగంగా సాంకేతిక ఆధారాలు, సమాచార సేకరణ ద్వారా బాలుడిని విజయవాడలో, యువతిని రాజమండ్రి ప్రాంతంలో గుర్తించారు. తరువాత వారిని గోపాలపట్నానికి తీసుకువచ్చి అవసరమైన ధృవీకరణలు పూర్తి చేసిన అనంతరం వారి బంధువులకు అప్పగించారు. తక్కువ వ్యవధిలోనే ఈ కేసులను ఛేదించి బాధితులను





సురక్షితంగా కుటుంబ సభ్యులకు చేర్చిన గోపాలపట్నం పోలీసులపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ,



కుటుంబ సభ్యులు ముఖ్యంగా పిల్లలు, యువతిపై పర్యవేక్షణ ఉంచాలని, అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# వేణు దత్త సువర్ణ లక్ష్మి దాంపత్య వ్రతం

- 50 మంది దంపతులు మంగళప్రదమైన కంకణాలు కట్టుకుని పూజలు చేశారు
- తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహణ






**విశాఖపట్నం: ఏప్రిల్ 12(పెన్ పవర్)** పాత వెంకోజీపాలెం – హెచ్ బీ కాలనీ రోడ్ లో ఉన్న ఎంవివి ప్రెసిడెన్సీ ఆడిటోరియంలో.. ఆదివారం.. వేణు దత్త సువర్ణ లక్ష్మి దాంపత్య వ్రతం నిర్వహించారు. తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ – రాధిక దంపతుల ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా బి.వి.రామ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తో పాటు, బిజెపి అగ్రశ్రేణి నాయకుడు మురళీ మనోహర్ జోషి లాంటి ఎందరో ప్రముఖులు ఆశీర్వాదాలు పొందిన భగవాన్ రామదత్త వద్ద శిష్యరికం చేసిన ముగ్గురు గొప్ప వ్యక్తులతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ప్రజలందరూ క్షేమంగా ఉండాలనే మంచి సంకల్పం కూడా ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. తమ దంపతులతో పాటు 50 మంది దంపతులు మంగళప్రదమైన కంకణాలు కట్టుకుని పూజలు చేశారన్నారు. ఇదిలా ఉండగా మే10వ తేదీన హైదరాబాదులోని జడ్చర్ల వద్ద అవదూత భగవాన్ రామదూత స్వామి.. తన తపస్సును భక్తులకు ధారా దత్తం చేస్తారన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో పాల్గొనే వారికి అన్ని కష్టాలు అడ్డంకులు తొలగిపోతాయని పేర్కొన్నారు. జడ్చర్లలో అవదూత స్వామివారి ఆశీస్సులను పొందాలని భావించేవారు తనను సంప్రదించాలన్నారు. అంతేకాకుండా ఆగస్టు మాసంలో విశాఖలో స్వామివారి ఆశీస్సులతో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

## చట్ట సభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

- జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై నాగేశ్వరరావు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్,ఏప్రిల్ 12 :** చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సూర్య హోటల్లో ఆదివారం విలేకరుల సమావేశంలో వై నాగేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడమే కాకుండా బీసీ రక్షణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. బీసీ జన గణన చేసి జనాభా ప్రాతిపదికన బడ్జెట్లో

నిధులు కేటాయించాలన్నారు. మహిళలకు చట్టసభలలో రిజర్వేషన్ కల్పించే బిల్లుకు చట్టబద్ధత కల్పించ డాన్ని స్వాగతిస్తామని, బీసీలకు ఉద్యోగాల్లో పదోన్నతులు కల్పించాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం గ్రామ, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి బీసీల హక్కులపై పోరాటం సాగిస్తుందన్నారు. . బీసీలకు 34 శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. ప్రతి జిల్లాలో బీసీ భవనాలు నిర్మిస్తామని, బీసీ హాస్టల్ అభివృద్ధి చేస్తామని మంత్రి లోకేష్ హామీపై కృతజ్ఞతలు తెలియజేశారు. సంఘాన్ని బలోపేతం చేయడంలో భాగంగా మండపేట నియోజకవర్గం అధ్యక్షునిగా వాసంశెట్టి వెంకటరమణను నియమించడం జరిగిందన్నారు. ఆయన మండల, గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేసి భారీ సభను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఆశయ సాధనకు రాష్ట్రంలో సంఘాన్ని బలోపేతం చేయడానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు లబ్ధిక మల్లేష్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, రాష్ట్ర ఇంచార్జ్ వెలగల నూకాలమ్మ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ కోటాను అమలు చేయాలని కోరారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఈనెల 16, 17, 18 తేదీలలో ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించడం అభినందనీమన్నారు.కార్పొరేషన్ ల చైర్మన్ లతో పాటు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇస్తున్నారు. అన్నారు. బీసీలకు రక్షణ చట్టం తీసుకువస్తామన్న హామీని నెరవేర్చాలని కోరారు. బీసీల కుల గణన జరగాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు లద్ధిక మల్లేష్ మాట్లాడుతూ త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో యువజన విభాగాల కమిటీలు ఏర్పాటు చేసే ఆగస్టులో భారీ సభను నిర్వహించినట్లు వెల్లడించారు. బీసీలకు చట్టసభలలో 50% రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండపేట అధ్యక్షులు వాసంశెట్టి వెంకటరమణకు, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి బి నాగ వెంకట రమేష్ లకు నియామక పత్రాలను అందజేసి, సంఘం కండువాలవేసి సత్కరించారు. వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్గా నియమితులైన కొల్లిబోయిన శ్రీనివాసరావు యాదవ్, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన దాలిపర్తి వేమన, రజక కార్పొరేషన్ డైరెక్టర్ రమేష్లను సత్కరించారు. విలేకరుల సమావేశంలో బిసి సంక్షేమ సంఘం నాయకులు కెకె సంజీవరావు, బూర హనుమంతరావు, యువజన విభాగం నగర అధ్యక్షుడు కాపరపు కిరణ్ కుమార్, రాజనాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు

# చీపురుపల్లిలో “రామ్ మల్లిక్ ప్రీమియర్ లీగ్ - సీజన్ 1” వాల్ పోస్టర్ ఆవిష్కరణ.



**చీపురుపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 12:** యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలనే లక్ష్యంతో రామ్ మల్లిక్ నాయుడు యువసేన ఆధ్వర్యంలో “రామ్ మల్లిక్ ప్రీమియర్ లీగ్ (ఆర్ ఎం పి ఎల్) – సీజన్ 1” క్రికెట్ టోర్నమెంట్ను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈరోజు చీపురుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో టోర్నమెంట్కు సంబంధించిన వాల్ పోస్టర్ను రామ్ మల్లిక్ నాయుడు విడుదల చేశారు.

ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన కీలక నాయకులు, రామ్ మల్లిక్ నాయుడు యువసేన సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్ మల్లిక్ నాయుడు మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వానికే కాకుండా, యువతలో క్రమశిక్షణను, ఐక్యమత్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ సీజన్ 1 టోర్నమెంట్ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అనంతరం టోర్నమెంట్ నిర్వహణ, నియమ నిబంధనలపై నాలుగు మండలాల నాయకులతో ప్రత్యేకంగా చర్చించారు. సమావేశం ముగిసిన తర్వాత అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో గరివిడి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సారి పాక సురేష్ బాబు, విజయనగరం జిల్లా రైతు సంఘం అధ్యక్షులు పైల బలరాం , రౌతు కాము నాయుడు, సన్యాసినాయుడు మరియు యువసేన ప్రతినిధులు, క్రీడా ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్థలం ప్రభుత్వానిది - ఆలయం ప్రైవేటు వ్యక్తులది


పెన్ పవర్ తెలుగు దిన పత్రిక ప్రశ్నించడం మన హక్కు

పాలకుల అనుమతితో ఆలయ నిర్మాణం !



అనధికార ఆలయ నిర్మాణానికి ప్రజా ప్రతినిధుల అండదండలు !

విశాఖ తూర్పు,పెన్ పవర్, ఏప్రిల్ 11: విశాఖ తూర్పు నియోజకవర్గం 13వ వార్డు ఆఖరి బస్టాప్ వద్ద ప్రభుత్వ భూమిలో అనధికార ఆలయ నిర్మాణానికి ప్రజా ప్రతినిధుల అనుమతితో నిర్మాణానికి అడుగులు పడ్డాయి.

ప్రభుత్వ స్థలాలను కాపాడవలసిన పాలకులే ఆలయ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారని అనడానికి వారి ఆహ్వాన పత్రికే సాక్ష్యం. ఆలయనిర్మాణానికి స్థానికులు వ్యతిరేకం కానప్పటికీ ప్రభుత్వ భూమిని కాపాడవలసిన ప్రజాప్రతినిధులు ఆలయ నిర్మాణాలకు స్థలం కేటాయించడం, నిర్మాణదారులు ఎమ్మెల్యే పేరున ఆహ్వాన పత్రిక ముద్రించి ప్రజలకు ఆహ్వానం తెలియజేయడం వింత పోకడకు దారితీసింది. శనివారం ఉదయం ఆలయ నిర్మాణ పనులను సచివాలయం 6 ప్లానింగ్ కార్యదర్శి అడ్డుకున్నప్పటికీ చీకటి పడిన తర్వాత ఆదివారం జరిగే ఆలయ శంకుస్థాపన పనులు చేపట్టారు.వరుస సెలవులు కావడంతో పక్కా ప్రణాళికతో ఆలయ నిర్మాణ పనులు చేపట్టారని,నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలంలో ఆలయ పనులను అడ్డుకోవలసిన అధికారులకు పాలకులు అడ్డు తగలడం సమంజసం కాదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సుమారు 15 ఏళ్లగా ఆలయ నిర్మాణం చేపడుతున్న ప్రభుత్వ స్థలంలో అదే ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి పశువులపాక నిర్మించుకుని జీవనం సాగిస్తున్నాడు,అదే ప్రాంతంలో ఆలయ నిర్మాణం చేపట్టడంపై సుమారు 15 ఏళ్లగా నివసిస్తున్న అతనిని తొలగించమనడం అదే ప్రాంతంలో ఆలయ నిర్మాణం చేపట్టడం పలు విమర్శలకు దారితీస్తున్నాయి.

ఆ ప్రాంతంలో గతంలో పలు ఆలయాలు మసీదు క్రిస్టియన్ కమ్యూనిటీ భవనాలు ఉన్నాయి. అత్యంత ఖరీదు గల ప్రాంతంలో ఆలయాల పేరిట ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ భూములను కాపాడవలసిన అధికారులు ప్రజాప్రతినిధులు ఆలయాలకు భూములను కట్టబెట్టడం సరికాదని స్థానిక ఎన్నికలు సమీపించడంతో ఓటు బ్యాంకు రాజకీయాలకు ఆలయాలు తెరపైకి వచ్చాయని దానికి స్థానిక ఎమ్మెల్యే వంతపాడడం సరికాదని,ఇప్పటికే ఆ ప్రాంతంలో అనేక ఆలయాలు నిర్మాణాలు చేపట్టి స్థానిక ఎమ్మెల్యే పేరును వాడుకుంటున్న వాటిని ఆయన ఖండించకపోగా స్థానిక ఎమ్మెల్యే పేరుతో ఆలయ శంకుస్థాపన ఆహ్వాన పత్రిక ప్రచురించడం విమర్శలకు దారితీస్తున్నాయి, స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ అధికారులతో మాట్లాడి అధికారకంగా ప్రభుత్వ స్థలాలను ఆలయ నిర్మాణానికి కేటాయించినట్లయితే పరవాలేదు కానీ ప్రభుత్వ భూమిలో ఆలయ నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేకపోవడం నిర్మాణాన్ని అడ్డుకున్న ప్లానింగ్ కార్యదర్శి ఆదేశాలు పట్టనట్టు వ్యవహరించడం ఎంతవరకు సమంజసం అని, పాలకులే అధికారుల అధికారాలను తుంగలో తొక్కడం సరికాదని ఇటు అధికారులకు చెప్పలేక ప్రజా ప్రతినిధులు మాటవినలేక అయోమయ పరిస్థితిలో విధులు నిర్వహిస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆలయ నిర్మాణాలకు తామేమీ అడ్డు కాదని ప్రజల అవసరాల మేరకు ఉపయోగించవలసిన ఖరీదైన భూములను కాపాడవలసిన అధికారులు ప్రజా ప్రతినిధులు వారి అధికారులకు వారే అడ్డు తగలడం సరికాదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

- ఆలయ శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే తనయుడు వెలగపూడి ప్రతాపరుద్ర
- మిగుల ప్రభుత్వ స్థలాలలో కుల సంఘాల భవనాలు లేదా ఆలయ నిర్మాణాలకు ప్రతిపాదన చేసేందుకు సిద్ధపడుతున్న స్థానిక నాయకులు



**విశాఖ తూర్పు,పెన్ పవర్, ఏప్రిల్ 12:** విశాఖ తూర్పు నియోజకవర్గం 13 వ వార్డు చివరి బస్ స్టాప్ ప్రాంతంలో ప్రభుత్వ స్థలంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి తనయుడు ప్రతాపరుద్ర. శ్రీ వాసవి మాత ఆవిర్భావ ఆర్యవైశ్య సంఘం,వాసవి క్లబ్ విక్టరీ ఆరిలోవ ఆధ్వర్యంలో ఆదివారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. 13వ వార్డు తెలుగుదేశం నాయకులు,కార్యకర్తలు ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి కమిటీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ స్థలంలో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన తీరు పట్ల స్థానిక ప్రజలలో భిన్నభిప్రాయాలు ఏర్పడ్డాయి. కొందరైతే వారి వారి కుల సంఘాల భవనాలు లేదా ఆలయ నిర్మాణాలకు ప్రస్తుతం నిర్మాణం జరుగుతున్న ఆలయ సమీప ప్రాంతంలో వారి యొక్క సంఘ భవనాలు నిర్మించుకునేందుకు లేదా ఆలయం నిర్మించుకునేందుకు సన్నహాలు మొదలయ్యాయి. కొందరు తమ సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు అనేకం ఉన్నాయని,తమ కుల సంఘాల నాయకులతో సంప్రదింపులు జరిపి ఆలయం లేదా కుల సంఘాల భవన నిర్మాణాలకు స్థలాలు కేటాయించాలనే ఆలోచనకు ప్రజలు పదును పెట్టనున్నారు. ఇప్పటికే కొందరు ఆలయం పేరు చెప్పి ఆక్రమించిన ప్రభుత్వ భూములకు కదలిక వచ్చింది. ఆలయాలు ఉన్నాయి కళ్యాణ మండపాలు కావాలి అనే ఆలోచనతో ప్రతిపాదనలుచేయనున్నారు.

వీటికి ప్రజా ప్రతినిధులు నాయకులు ఏ విధంగా స్పందిస్తారొ వేచి చూడాలి.

# చింతపల్లి ఏపీ ఆర్ కళాశాలకు సుదీర్ఘ చరిత్ర ఉంది.

- విద్యార్థులు ప్రయోజకులై ఉన్నత స్థానాలలో స్థిరపడితే తల్లిదండ్రుల కన్నా ఎక్కువగా సంతోషపడేది గురువులే.
- విశ్రాంత అధ్యాపకులు కుమార్ బాబు.



**చింతపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 12.** విద్యార్థులు జీవితంలో రాణించి ప్రయోజకులైతే తల్లిదండ్రుల తర్వాత అత్యంత సంతృప్తి సంతోషం కలిగేది ఉపాధ్యాయులకే అని విశ్రాంత అధ్యాపకులు కుమార్ బాబు అన్నారు. ఆదివారం స్థానిక గురుకుల కళాశాలలో పూర్వ విద్యార్థులు అధ్యాపకుల ఆత్మీయ సమ్మేళనం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా విశ్రాంత అధ్యాపకులు మాట్లాడుతూ 1985 నుండి నేటి వరకు కళాశాలలో పనిచేసే నా అధ్యాపకులు విద్యార్థులను ఒకే వేదికపై చూడడం సంతృప్తినిచ్చిందన్నారు. తమ వద్ద విద్యను అభ్యసించిన విద్యార్థులు ఉన్నత స్థాయి లో స్థిరపడ్డారని తెలుసుకొని ఆనందిస్తున్నామన్నారు. మరికొంతమంది విద్యార్థులు వ్యాపారం, వ్యవసాయ రంగాలలో రాణిస్తున్నమని చెబుతుంటే ఆనందంతో కళ్ళు చమర్చాయి అన్నారు. అలాగే చింతపల్లి ఏపీఆర్ కళాశాలకు సుదీర్ఘ చరిత్ర ఉందని ఈ కళాశాలలో సీట్స్ సాధించడం అంటే ఆనాటి విద్యార్థుల కలలకు సాకారం జరిగినట్టేనని అన్నారు. కళాశాలలో సీటు రావడం అంటే అదృష్టంగా భావించేవారున్నారు. ఉన్నత స్థాయిలో ఉన్న విద్యార్థులు కళాశాల అభివృద్ధికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం 20 మంది విశ్రాంత అధ్యాపకులను విద్యార్థులు నమస్సుమాంజలీలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ విశ్రాంత అధ్యాపకులు కే విజయ్ కుమార్, సత్యనారాయణ రాజు,రామకృష్ణ, నిర్వాహక కమిటీ ప్రతినిధులు యు వి గిరి, కుడుముల వెంకటరమణ, గాసాడి పద్మనాభం, గేలి మోహన్, చింతల సాగర్, ఆంధ్ర విశ్వ కళాపరిషత్ తెలుగు డిపార్ట్మెంట్ అధిపతి ప్రొఫెసర్ జర్ర అప్పారావు, ఏపీ ఈపీడీసీఎల్ సిజిఎం లొంజ మహేంద్రనాథ్, విద్యుత్ ఎస్. ఈ. సోమశేఖర్ పాల్గొన్నారు.

# రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం





- 200 మందికి వైద్య సేవలు

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఏప్రిల్ 12:** పోలవరం జిల్లా రంపచోడవరం మండలం సిరిగిందలపాడు గ్రామంలో రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామీ పరిజ్ఞేయానందజీ మహారాజ్ వెల్లడించారు. ఈ వైద్య శిబిరంలో డా. శ్రీనివాస్ రాయుడు, డా. దాసరి ఉమామహేష్, డా. తలారి వెంకట సుబ్బారావు, డా. పావని ప్రియ పాల్గొని సుమారు 200 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. వీరిలో 64 మందికి రక్త పరీక్షలు, 9 మందికి థైరాయిడ్ పరీక్షలు, ఒకరికి ఈసీజీ, 7 మందికి ఎక్స్రే పరీక్షలు, 8 మందికి ఫిజియోథెరపీ చికిత్సలు నిర్వహించారు. అలాగే వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయ, ఆధ్వర్యంలో 52 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 8 మందిని శుక్లాం శస్త్రచికిత్స కోసం వేమగిరి ఆసుపత్రికి తరలించారు. మరో 15 మందికి కళ్లజోళ్లు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో నేత్రాలయ ప్రోగ్రాం మేనేజర్ నక్కా చంటిబాబు, సిబ్బంది పాల్గొన్నారు. శిబిరానికి హాజరైన రోగులు, సహాయకులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రామకృష్ణ మిషన్ కోఆర్డినేటర్ కానుమూరు శ్రీనివాస్, గిరిజన సంచార వైద్యశాల సిబ్బంది, వాలంటీర్ దాసరి పెద్ద అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



# బెజవాడలో అమానుషం.. పబ్లిక్ టాయిలెట్స్ లో పసి ప్రాణాల్ని వదిలేసింది



**హైదరాబాద్ పెన్ పవర్:** విజయవాడలో అమానుష ఘటన ఒకటి చోటు చేసుకుంది. ముక్కపచ్చలారని పసికందును పబ్లిక్ టాయిలెట్స్ వద్ద వదిలేసి వెళ్లిన మహాతల్లి పాషాణ మనసు తీరు షాకింగ్ గా మారింది. పసిపిల్లను ఎత్తుకొని ఆటో ఎక్కిన ఒక మహిళ.. క్రిష్ణలంక స్టేషన్ వద్ద ఉన్న పబ్లిక్ టాయిలెట్ వద్ద ఆటోను ఆపేసింది. బాత్రూంకు వెళ్లాలని చెప్పిన సదరు మహిళ.. ఆ పసికందును టాయిలెట్ వద్ద వదిలేసి.. అడ్డుగా ఒక బకెట్ పెట్టి.. తన దారిన తాను వెళ్లిపోయింది. టాయిలెట్ ను శుభ్రం చేసేందుకు వచ్చిన శానిటేషన్ సిబ్బంది పసికందును చూసి ఒక్కసారి షాక్ తిన్నారు. ముక్కపచ్చలారని చిన్నారిని అలా వదిలేసి వెళ్లిపోతారా? అన్న షాక్ కు గురైన వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

వెంటనే స్పందించిన పోలీసులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఉదంతంపై కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ జరుపుతున్నారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా మహిళ ప్రయాణించిన ఆటోను గుర్తించి.. ఆటో డ్రైవర్ ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఆటోలో ఆ మహిళ విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద దిగినట్లుగా గుర్తించారు. ఆ మహిళఎవరు? ఎక్కడ పసికందును ప్రసవించింది? ఎందుకు వదిలేసి వెళ్లిపోయింది? లాంటి ప్రశ్నలకు సమాధానాలు వెతికే ప్రయత్నం చేస్తున్నారు. కారణం ఏమైనా.. పసికందును అంత కర్కశంగా వదిలేసిన మహాతల్లి తీరును పలువురు తప్పు పడుతున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# జగన్ దెబ్బకు చంద్రబాబుకు మైండ్ బ్లాక్ అయినట్లుందిగా?




**హైదరాబాద్ పెన్ పవర్:**వైఎస్ జగన్ మావిగన్ ప్రతిపాదన తెచ్చి ఒకరకంగా అమరావతికి అడ్డంగా నిలబడ్డట్టే కనపడుతుంది. జగన్ వ్యాఖ్యలు చూసిన వారికి తొలుత జోక్ గా అనుకున్నప్పటికీ రాను రాను దాని వెనక ఉన్న సీరియస్ నెస్ అయింది. అమరావతిలో అన్ని లక్షల కోట్లు.. అదీ చంద్రబాబు హయాంలో ఖర్చు చేయడం జగన్ కు ఏమాత్రం ఇష్టం లేదు. అంతే కాకుండా అమరావతిలో పెట్టుబడులు రాకుండా ఉండేందుకే జగన్ మావిగన్ ప్రతిపాదన తెచ్చారన్నది మాత్రం వాస్తవం. ఇదే విషయాన్ని కూటమి నేతలు సయితం అంగీకరిస్తున్నారు. అమరావతిలో కేవలం ప్రభుత్వ భవనాలు వచ్చినంత మాత్రాన భూముల ధరలు పెరగవు. అలాగే ఏ మాత్రం రాజధాని అడుగు ముందుకు పడదు.

**మెడికల్ కళాశాలల విషయంలోనూ...**

గతంలో జగన్ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరించాలని చంద్రబాబు చేసిన ప్రయత్నాన్ని కూడా ఇదే రకంగా అడ్డుకున్నారు. ఆ విషయంలో అయితే మెడికల్ కళాశాలలకు ఇంత వరకూ టెండర్లు రాకపోవడానికి కారణం జగన్ కాక ఇంకెవరన్న ప్రశ్నకు కూటమి నేతల నుంచి కూడా సమాధానం లేదు. ఎందుకంటే తాను మళ్లీ అధికారంలోకి వస్తే మెడికల్ కళాశాలలన్నింటినీ ప్రభుత్వ పరం చేస్తానని, అవసరమైతే చట్టపరంగా ముందుకు వెళతానని జగన్ హెచ్చరించి టెండర్లు రాకుండా అడ్డుకున్నారు. ఇప్పుడు అదే తరహాలో అమరావతి విషయంలోనూ మావిగన్ ప్రతిపాదనతో ముందుకు వచ్చారు.

**పెట్టుబడి దారులకు చేరడంతో...**

నిజానికి మావిగన్ లో మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు కలిపి చేయాలన్నది జగన్ ప్రతిపాదన. మచిలీపట్నాన్ని పక్కన పెడితే సీఆర్డీఏ పరిధిలో ఇవన్నీ ఉన్నాయి. కొత్తగా ఏమీ లేదు. కాకుంటే అమరావతిలో పెట్టుబడులు వస్తే త్వరగా డెవలెప్ అయితే ఆ క్రెడిట్ చంద్రబాబుకు వెళుతుందన్న బాధ, ఆక్రోశంతో కొత్త ప్రతిపాదన తెచ్చాడు. తాను అమరావతికి వ్యతిరేకం కాదంటూనే.. తాను తిరిగి వస్తే చట్టాన్ని ఎందుకు మార్చలేనని ప్రశ్నించి ఇన్వెస్టర్లలో మరింత అనుమానాలను జగన్ లేపగలిగాడు. జగన్ ఒకరకంగా అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా చంద్రబాబు ను అడ్డుకుంటూ తన వ్యూహాలతో ముందుకు వెళుతున్నాడు. జగన్ అమరావతి బెదిరింపులు పెట్టుబడి పెట్టేవారి చెవులకు ఎప్పుడో చేరాయి. అది చాలు. అందుకే వైసీపీ నేతల చేత మావిగన్ నామస్మరణ చేయిస్తూ పెట్టుబడులు అమరావతి వైపు రాకుండా అడ్డుకుంటున్నారన్న వాదన ఉంది. ఏతా వాతా నష్టపోయేది మాత్రం.. పాపం భూములిచ్చిన రైతన్నలే.

# ఉద్యోగులు కూటమి వైపేనా.. చంద్రబాబు ఆలోచన అదేనా?

**హైదరాబాద్ పెన్ పవర్:** కూటమి ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులను దగ్గరకు చేర్చుకుంటుంది. గత ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు దూరం పెడితే కూటమి ప్రభుత్వం మాత్రం అక్కున చేర్చుకుంటుంది. ఏ ఎన్నికల్లో అయినా.. సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కూడా ప్రభుత్వ ఉద్యోగులది కీలక పాత్ర. వారిని అక్కున చేర్చుకోవడంతో గత ప్రభుత్వానికి తమ పాలనకు మధ్య వ్యత్యాసం చూపిస్తే చాలు తమకు స్థానిక సంస్థల ఎన్నికల్లో కావచ్చు.. సాధారణ ఎన్నికల్లోనూ గెలుపునకు వారు ముఖ్య భూమిక పోషిస్తారు. నిత్యం ప్రజల్లో తిరిగే ఉద్యోగులు మౌత్ టాక్ తో ప్రభుత్వ పాలన పట్ల పాజిటివ్ టాక్ తేగలరన్నది చంద్రబాబు భావన.

**ప్రతి నెల ఒకటో తేదీ...**

అందుకే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నెల ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించే కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. గతంలో మాదిరిగా ఉద్యోగులను వేధించకుండా, సస్పెన్షన్లు వంటివి చేయకుండా ఎక్కువగా కలెక్టర్లు, ఎస్సీలతో సమీక్షలతోనే చంద్రబాబు సరిపెడుతున్నారు. మరొకవైపు గత ప్రభుత్వంలో జీతం ఎప్పుడు వస్తుందో రాదో తెలియని పరిస్థితి నుంచి ఒకటో తేదీ నాడు నిధులు జమ అవుతాయన్న నమ్మకాన్ని కలిగించారు. దీంతో పాటు గత ప్రభుత్వంలో బకాయిలు పెట్టిన దాదాపు ఏడు వేల కోట్ల రూపాయల నిధులను విడుదల చేశారు. దీంతో చాలా వరకూ ఉద్యోగులు ఆనందం లో ఉన్నారు.

**రిటైర్డ్ అయిన ఉద్యోగులకు...**

గత ప్రభుత్వం రిటైర్డ్ అయిన ఉద్యోగులకు చెల్లింపులు జరపలేదు.ప్రావిడెంట్ ఫండ్ కింద 1,847.83 కోట్లు, గ్రాట్యుటీ కింద 3,411.03 కోట్లు, రిటైర్డ్ ఉద్యోగుల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కింద 1,800 కోట్లు, పోలీసులకు అదనపు సరెండర్ లీవుల కింద 223.47 కోట్లు విడుదల చేశారు. గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్ నిమిత్తం 4,793 మంది ఉద్యోగులకు రూ.76 కోట్ల చెల్లింపులు జరిగాయి. మొత్తం 7,059 కోట్ల మేరకు బిల్లుల చెల్లింపు చేపట్టింది. తాజాగా రిటైర్డ్ అయిన ఉద్యోగులకు భారీ ఊరట లభించింది. పెండింగ్‌లో ఉన్న గ్రాట్యూటీ మరియు సరెండర్ లీవ్ బిల్లుల చెల్లింపులు ప్రారంభమయ్యాయి. దాదాపు 2950 కోట్ల చెల్లింపులు విడుదలయ్యాయి.ఈ మొత్తాలు సంబంధిత రిటైర్డ్ ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయి. సర్వీస్‌లో ఉన్న పోలీసు ఉద్యోగుల సరెండర్ లీవ్ బిల్లుల చెల్లింపులు కూడా ప్రారంభమయ్యాయి. దీంతో ఉద్యోగ వర్గాలు ప్రభుత్వ అనుకూలంగా మారే అవకాశముందన్న అంచనాలు వినపడుతున్నాయి.

# పులివెందులలో వాళ్లపై పోలీస్ మార్క్.. అదరగొట్టేశారు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ.. సామాన్యులను భయభ్రాంతులకు గురి చేసే వారికి వినూత్న రీతిలో ట్రీట్ మెంట్ ఇవ్వ?వలసిన అవసరం ఉంది. తాజాగా వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల పోలీసులు ఇదే తీరును ప్రదర్శించారు. మద్యం మత్తులో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ.. అల్లర్లకు పాల్పడిన ఎనిమిది మందికి పగలే చుక్కలు కనిపించేలా.. పోలీసులు వారికి తమదైన ట్రీట్ మెంట్ ను ఇచ్చారు. నడి వీధిలె నడిపించుకుంటూ స్టేషన్ కు తీసుకెళ్లారు.నాలుగు రోజు లక్రితం మద్యం మత్తులో వీరంగం వేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. సీన్ రీ కన్ స్ట్రక్షన్ చేసే ప్రక్రియలో భాగంగా పులివెందుల పూల అంగళ్ల కూడలి నుంచి నడిపించుకుంటూ పాత బస్టాండ్ వరకు తీసుకొచ్చారు. పోలీసులు తీరు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. పులివెందుల ప్రజలకు ఈ తీరు కొత్తగా ఉండటమే కాదు.. తమకు తిరుగే లేదన్నట్లుగా వ్యవహరించే వారి పీచమణిగేలా పోలీసుల ట్రీట్ మెంట్ ఉందని చెబుతున్నారు.అల్లర్లకు పాల్పడే వారికి.. అసాంఘిక శక్తులను వదిలి పెట్టేది లేదంటూ డీఎస్పీ మురళీనాయక్ పేర్కొన్నారు. ఇంతకూ జరిగిందేమంటే.. పులివెందులలోని పాతబస్టాండ్ వద్ద జగదీశ్ అనే వ్యక్తిపై తిరుపాల్.. మరికొందరు మద్యం మత్తులో దాడి చేశారు. వీరికి గతంలోనూ గొడవలు ఉన్నాయి. తిరుపాల్ – జగదీశ్ మధ్య



శత్రుత్వం ఉంది. రెండేళ్ల క్రితం అరటి పండ్ల వ్యాపారంలో హమాలీల సంఘం ఏర్పాటులో వివాదం ఉంది.ఈ నేపథ్యంలో జగదీష్ పోలీసులకు కంప్లైంట్ చేశాడు.కానీ.. ఆ తర్వాత దాన్ని వెనక్కి తీసుకున్నారు.

తాజాగా జగదీష్ తన భార్యతో గొడవలు నెలకొన్న నేపథ్యంలో ఒక బార్ కు వెళ్లి మద్యం తాగుతున్నాడు. అదే సమయంలో తిరుపాల్ అక్కడకు రావటం.. అతడ్ని చూసినంతనే బూతులు తిట్టటంతో.. ఘర్షణ మొదలైంది. ఈ క్రమంలో తిరుపాల్ తన అనుచరులతో కలిసి కర్రలతో దాడి చేశాడు. దీంతో..జగదీష్ ఫిర్యాదును పరిగణలోకి తీసుకొన్న పోలీసులు తిరుపాల్ తో పాటు అతడి అనుచరులను అదుపులోకి తీసుకొని.. పులివెందుల రోడ్ల మీద నడిపించారు. అసాంఘిక శక్తుల విషయంలో కరకుగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్న వ్యాఖ్య వినిపిస్తోంది.

# ఏడాదిలో అంత భారీగా తిరుమల శ్రీవారి దర్శనాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుమల శ్రీవారిని దర్శించుకునే భక్తుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. 2025–26లో భక్తులు ఎంత భారీగా స్వామి వారిని దర్శించుకున్నారన్న లెక్కలు బయటకు వచ్చాయి. అంతేకాదు.. శ్రీవారి హుండీ ఆదాయం భారీగా పెరిగింది. అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవటంతో పాటు.. పక్కా ప్లానింగ్ తో భారీగా వస్తున్న భక్తులకు తగ్గట్లు దర్శనాల కార్యక్రమాన్ని పూర్తి చేస్తున్నట్లుగా చెప్పాలి. 2023-24, 2024–25లో రోజుకు సగటున 70 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా.. 2025–26లో మాత్రం అందుకు భిన్నంగా రోజుకు 73 వేలమంది భక్తులు దర్శించుకోవటం గమనార్హం. గత ఏడాది జూన్ లో శనివారాల్లో సగటున 90–95 వేల మందికి పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏడాదశి సందర్భంగా పది రోజుల్లో అంతకు ముందు ఏడాదితో పోలిస్తే అదనంగా 1.40 లక్షల మంది స్వామి వారి దర్శనం చేస్నుకోవటం గమనార్హం. ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షిస్తూ.. క్యూలైన్లలో భక్తులు రద్దీ.. కంపార్ట్ మెంట్ల వెయింటింగ్ సమాయాన్ని చూసి.. ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకునేలా.. ఎక్కువ మంది భక్తులకు స్వామి వారి దర్శనం జరిగేలా అధికారులు నిర్ణయం తీసుకుంటున్నారు. దీంతో స్వామి వారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శనం చేసుకునే వెసులుబాటు కలుగుతోంది. సాధారణంగా స్వామి వారిని దర్శించుకునే భక్తుల రద్దీ జులై.. ఆగస్టులో ఉంటుంది. ఆ నెలల్లోనే స్వామి వారి హుండీ ఆదాయం రూ.120 కోట్లు దాటుతుంది. కానీ.. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా ఆర్నెల్లు హుండీ ఆదాయం.. ప్రతి నెలా రూ.120 కోట్లకు పైగా నమోదు కావటం విశేషం.

మొత్తంగా ఏడాదిలో హుండీ ఆదాయం ర.1420 కోట్లకు దాటింది. లడ్డూ విక్రయాల సంఖ్య కూడా భారీగా పెరిగింది. 2024–25లో 12.49 కోట్ల లడ్డూలు అమ్మగా.. 2025–26లో 13.95 కోట్ల లడ్డూ అమ్మకాలు సాగాయి. 2023–24లో రోజుకు సగటున 1.87 లక్షల మందికి అన్నప్రసాదాలు అందించగా.. 2024–25లో సగటున రోజుకు 2.21 లక్షల మందికి అన్నప్రసాదాలు అందించారు.

2025–26లో ఈ సంఖ్య ఏకంగా 2.85 లక్షలకు చేరుకోవటం విశేషం. బంగారు.. వెండి డాలర్ల ఆదాయం కూడా భారీగా పెరిగింది. 2024–25లో బంగారు డాలర్ల అమ్మకాలతో రూ33.88 కోట్లు.. వెండి డాలర్ల అమ్మకాలతో రూ.2.7 కోట్ల ఆదాయం వచ్చింది. 2025–26లో ఈ ఆదాయం రూ.56.10 కోట్లు (బంగారు డాలర్ల అమ్మకాలపై) రూ.5.22 కోట్లు (వెండిడాలర్ల అమ్మకాలపై) ఆదాయం స్వామి వారికి సమకూరింది. స్వామికి వచ్చే ఆదాయాల్లో పెద్ద ఎత్తున పెరుగుతోంది.. బంగారు, వెండి డాలర్ల అమ్మకాల మీదనే కావటం గమనార్హం.


# వైసీపీ మావిగాన్ : కమ్మ వర్సెస్ కాపు ఇష్యూ గానా ?

**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ అమరావతి రాజధాని విషయంలో తనదైన శైలిలోనే ముందుకు సాగుతోంది. మావిగాన్ అన్నది వైసీపీ యధాలాపంగా అన్నదా అంటే కాదు అని తెలుస్తోంది. తాము అనుకున్నట్లుగానే మావిగాన్ ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. చిత్రమేంటి అంటే అమరావతి కంటే మావిగాన్ కి జనాల మద్దతు ఉందని వైసీపీ భ్రమించడం. నిజానికి ఇది అతి పెద్ద ట్రోల్ కంటెంట్ గా మారి సోషల్ మీడియాలో స్ప్రెడ్ అయింది. దాని వల్ల పాజిటివిటీ కంటే నెగిటివిటి వ్యాప్తి చెందుతోంది. కానీ వైసీపీ మాత్రం మావిగాన్ అన్న దాని మీద జనాలు పెద్ద ఎత్తున ఆదరణ కనబరుస్తున్నారని అందుకే టీడీపీలో వణుకు పుడుతోంది అని అంటోంది.

**సెల్ఫ్ గోల్ వేసుకుంటూనే :**

అయితే మావిగాన్ విషయంలో వైసీపీ సెల్ఫ్ గోల్ వేసుకుందని టీడీపీ వర్గాలు అంటున్నాయి. ఈ విషయం తెలిసినా తెలియనట్లుగా అంతా బాగానే ఉంది తమ డిమాండ్ కి మద్దతు లభిస్తోందని చెప్పుకుని ఆత్మ సంతృప్తి చెందుతోందని టీడీపీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. వైసీపీ అయితే గత వారం పది రోజులుగా మావిగాన్ ని ఒక బలమైన స్లోగన్ గా తమకు దాని వల్ల వేయి రెట్లు రాజకీయ బలం వచ్చినట్లుగా చేసుకుంటున్న ప్రచారాన్ని చూసి అంతా ఆశ్చర్యపోతున్నారు. నిజానికి ఇది రాజధాని ఎంపిక సమయం కాదని అంతా అంటున్న మాట. ఇక అమరావతికి రాజధాని చట్టబద్ధత వచ్చి నిర్మాణాలు వేగంగా సాగుతున్న వేళ వైసీపీ వింత పోకడలతో కొత్త ప్రతిపాదనలతో తానుగా గందరగోళంలో పడుతోంది అని అంటున్నారు.

**సామాజిక చర్చగా :**



ఇదిలా ఉంటే మావిగాన్ లో ఫస్ట్ అక్షరం మచిలీపట్నం ఉంది. అలా మచిలీపట్నానికి రాజధాని హోదా ఇవ్వాలని అభివృద్ధి చేయాలని తాము కోరుతూంటే కూటమి ప్రభుత్వం మాత్రం అంతా అమరావతిలోనే అంటూ ముందుకు సాగుతోందని వైసీపీ క్షేత్ర స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేస్తోంది. కాపులు అధికంగా ఉన్న ప్రాంతంగా మచిలీపట్నం ఉంది కాబట్టి టీడీపీ వ్యతిరేకిస్తోంది అని వైసీపీ శ్రేణులు స్థానికంగా ప్రచారం చేస్తున్నారు అని అంటున్నారు. దాంతో ఇది సామాజిక సమస్యగా మారేలా చూస్తున్నారా అన్న చర్చ సాగుతోంది. దీంతో అలెర్ట్ కావాల్సిన అవసరం టీడీపీకి ఉందని అంటున్నారు.

**వైసీపీకి అక్కడ దెబ్బ :**

మావిగాన్ అంటూ ఎండమావులలో నీటిని వెతికే భ్రమలో వైసీపీ ఒక వైపు ఉందని విమర్శలు వస్తున్నాయి. అదే సమయంలో మూడు రాజధానులు అంటూ ఉత్తరాంధ్రకు విశాఖ, రాయలసీమకు కర్నూలు న్యాయ రాజధాని అని ఊరించిన వైసీపీ ఇపుడు మావిగాన్ అని మాట్లాడడంతో తన స్టాండ్ మార్చుకోవడంతో ఆయా ప్రాంతాలలో వైసీపీకి రాజకీయంగా ఇబ్బంది వస్తుందని అంటున్నారు. వైసీపీ ఎంతగా మావిగాన్ అని ప్రచారం చేస్తూ పోతే అంతలా రాజకీయ నష్టం ఈ ప్రాంతాలలో ఉంటుందని అదే సమయంలో మావిగాన్ ప్రాంతంలో రాజకీయంగా వైసీపీకి ఒరిగేది ఏమీ ఉండదని విశ్లేషిస్తున్నారు. మొత్తం మీద వైసీపీ రాజధాని విషయంలో తరచూ స్టాండ్ మార్చుకోవడం కొత్త పేర్లతో జనంలోకి రావడంతో జగన్ నిలకడలేని తనం మీద వైసీపీకి ఏపీ రాజధాని విషయంలో ఉన్న చిత్తశుద్ధి నిబద్ధత వంటివి తెలియచేస్తున్నాయని అంటున్నారు.

# చెలరేగిన గిల్, బట్లర్.. లక్నోపై గుజరాత్ ఘన విజయం





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026లో భాగంగా ఏకనా స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ తో జరిగిన కీలక పోరులో గుజరాత్ టైటాన్స్ ఘన విజయం సాధించింది. లక్నో నిర్దేశించిన 165 పరుగుల టార్గెట్ కోసం బరిలోకి దిగిన గుజరాత్ బ్యాటర్లు శుభ్‌మన్ గిల్, జోష్ బటర్లు హాఫ్ సెంచరీలతో చెలరేగిపోవడంతో సునాయసంగా గెలిచింది. అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన లక్నో బ్యాటర్లు గుజరాత్ టైటాన్స్ బౌలర్ల ధాటికి చేతులెత్తేశారు. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 164 పరుగులు మాత్రమే చేసింది. లక్నో జట్టులో ఐడెన్ మార్క్రమ్ (30) టాప్ స్కోరర్ గా నిలిచాడు. మిగతా బ్యాటర్లు నికోలస్ పూరన్ (19), రిషబ్ పంత్ (18), అబ్దుల్ సమద్ (18), ముకుల్ చౌదరీ(18), జార్జ్ లిండే (16), మహమ్మద్ షమీ(12), మిచెల్ మార్ష్ (11) 20 పరుగుల కంటే తక్కువగా చేయగా, ఆయూష్ బదోనీ మరోసారి ఘోరంగా విఫలమయ్యాడు. కేవలం 9 పరుగులు మాత్రమే చేసిన పెవిలియన్ కి చేరుకున్నాడు.

అనంతరం 165 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన గుజరాత్ టైటాన్స్ జట్టుకి మంచి శుభారంభం లభించింది. ఓపెనర్స్ శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ మధ్య నెలకొన్న 45 పరుగుల భాగస్వామ్యాన్ని దిగ్వేశ్ సింగ్ రాఠీ విడదీశాడు. సాయి సుదర్శన్ (15)ని తక్కువ పరుగులకే పెవిలియన్ కి పంపించాడు. అనంతరం బ్యాటింగ్ కి వచ్చిన జోష్ బట్లర్ తో కలిసి ఇన్నింగ్స్ ని ముందుకు నడిపించిన శుభ్‌మన్ గిల్ (40 బంతుల్లో 6 ఫోర్లు ఒక సిక్సుతో 56 పరుగులు ) హాఫ్ సెంచరీ చేసిన తర్వాత 129 పరుగుల వద్ద ప్రిన్స్ యాదవ్ బౌలింగ్ లో వికెట్ కీపర్ రిషభ్ పంత్ కి క్యాచ్ ఇచ్చి

మైదానం వీడాడు. మరో బ్యాటర్ జోష్ బట్లర్ ( 37 బంతుల్లో 11 ఫోర్లతో 60 పరుగులు) కూడా అర్ధ శతకం కొట్టిన తర్వాత మహమ్మద్ షమీ బౌలింగ్ లో భారీ షాట్ ఆడే క్రమంలో బౌండరీ లైన్ వద్ద ఐడెన్ మార్క్రమ్ కి క్యాచ్ ఇచ్చి పెవిలియన్ కి చేరుకున్నాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన రాహుల్ తెవాటియా (9), వాషింగ్టన్ సుందర్ (11 బంతుల్లో 2 ఫోర్లు ఒక సిక్సుతో 20 పరుగులు ) మ్యాచ్ ని ఫినిష్ చేశారు. లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లలో దిగ్వేశ్ రాఠీ, మహమ్మద్ షమీ, ప్రిన్స్ యాదవ్ తలో వికెట్ పడగొట్టారు.

# ముంబై ఇండియన్స్ వర్సెస్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య హై-వోల్టేజ్ పోరు.. ఈ మ్యాచ్‌లో ఆ జట్టుదే పైచేయి!





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ వర్సెస్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య పోరు చాలా ఆసక్తికరంగా ఉండబోతోంది. ఈ మ్యాచ్ ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరుగుతుంది. ముంబై జట్టు తమ సొంత మైదానంలో ఆడటం వల్ల వారు కొంత పైచేయి సాధించే అవకాశం ఉంది. ఎంఐ జట్టులో రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్య లాంటి ఆటగాళ్లు జట్టుకు బలంగా నిలుస్తున్నారు. మరోవైపు బెంగళూరు జట్టులో విరాట్ కోహ్లీ ప్రధానంగా నిలుస్తాడు. ఈ మ్యాచ్‌లో హార్దిక్ పాండ్య, కృనాల్ పాండ్య మధ్య పోరు ప్రత్యేక ఆకర్షణగా ఉండనుంది.

**ఈరోజు విజేత ఎవరంటే?:**

వాంఖడే పిచ్ బ్యాటింగ్‌కు స్వర్గధామం. భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం ఉంటుంది. హోమ్ గ్రౌండ్ అడ్వాంటేజ్, గత రికార్డుల (వాంఖడేలో చివరి 7 మ్యాచ్‌ల్లో ముంబై 6 గెలిచింది) దృష్ట్యా ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ గెలిచే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మరోవైపు, వాంఖడేలో విరాట్ కోహ్లీకి అద్భుతమైన రికార్డు ఉంది. ఇక్కడ ఆడిన 22 మ్యాచ్‌ల్లో 55 సగటుతో 838 పరుగులు సాధించాడు.

**ప్లేయింగ్ XI:**

**ముంబై ఇండియన్స్:** రోహిత్ శర్మ, ర్యాన్ రికెల్టన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా (కెప్టెన్), నమన్ ధీర్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, మిచెల్ సాంట్నర్, శార్దూల్ ఠాకూర్, ట్రెంట్ బౌల్ట్, జస్ప్రీత్ బుమ్రా.

**ఆర్సీబీ:** విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్, దేవదత్ పడిక్కల్, రజత్ పాటిదార్ (కెప్టెన్), జితేష్ శర్మ (వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, అభినందన్ సింగ్, జోష్ హేజిల్‌వుడ్.

# చెన్నై సూపర్ కింగ్స్ ఫ్యాన్స్ కి బ్యాడ్ న్యూస్.. ఐపీఎల్ మొత్తానికి ఎంఎస్ ధోనీ దూరం?



**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులకు బ్యాడ్ న్యూస్. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ మొదలై రెండు వారాలు గడిచినా, ఆ జట్టు మాజీ కెప్టెన్ ధోనీ ఇంకా మైదానంలోకి అడుగు పెట్టలేదు. శనివారం ఢిల్లీ క్యాపిటల్స్‌పై చెన్నై సీజన్ తొలి విజయాన్ని నమోదు చేసినప్పటికీ, అతడు లేని లోటు స్పష్టంగా మైదానంలో కనిపించింది. అయితే ధోనీ ఫిట్‌నెస్ సాధిస్తే, కేకేఆర్‌పై ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ అతను రాకపోతే, సంజూ శాంసన్ మరోసారి చెన్నై జట్టుకి కీలకం కానున్నాడు.

**ఫిట్‌నెస్ సమస్యే కారణమా?:**

ఎంఎస్ ధోనీ ప్రస్తుతం కాళ్ళు పిక్కలు నొప్పులతో బాధపడుతున్నట్లు తెలుస్తుంది. ఈ ఏడాది జులై 7వ తేదీన 45వ పడిలోకి అడుగు పెట్టనున్న ధోనీ ఫిట్‌నెస్‌పై మాజీ ప్లేయర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ మాట్లాడుతూ.. ఎంఎస్ కేకేఆర్‌తో మ్యాచ్‌కు వస్తాడా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.. అతను బ్యాటింగ్ ప్రాక్టీస్ అయితే మొదలుపెట్టాడు కానీ, ఎప్పుడు పునరాగమనం చేస్తాడనేది జట్టు మేనేజ్‌మెంట్‌కు కూడా సరిగ్గా తెలియదని పేర్కొన్నాడు.. జట్టు దృష్టి మళ్ళకూడదనే ధోనీ మైదానానికి రావడం లేదని తన యూట్యూబ్ ఛానెల్‌లో తెలిపాడు.

**సంజూ శాంసన్ మెరుపులు:**

మహేంద్ర సింగ్ ధోనీ లేని లోటును భర్తీ చేసేందుకు జూఖ పక్కా ప్లాన్‌తో వచ్చింది. రాజస్థాన్ రాయల్స్ నుంచి ట్రేడ్ ద్వారా వచ్చిన సంజూ శాంసన్, లాంగ్ టర్మ్ వికెట్ కీపర్ ఆప్షన్‌గా కనిపిస్తున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సంజూ 115 పరుగులతో (నాటౌట్) వీరవిహారం చేసి చెన్నైకి ఈ సీజన్ మొదటి విజయాన్ని అందించాడు.

**పాయింట్ల పట్టికలో చెన్నై:**

రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలోని జూఖ ఈ సీజన్‌ను వరుసగా మూడు ఓటములతో అత్యంత పేలవంగా ప్రారంభించింది. కానీ నాలుగో మ్యాచ్‌లో గెలిచి పాయింట్ల ఖాతా తెరిచింది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో చెన్నై 9వ స్థానంలో కొనసాగుతుంది. ఇక చెన్నై తన తదుపరి పోరులో ఏప్రిల్ 14 (మంగళవారం) నాడు కోల్‌కతా నైట్ రైడర్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లోనైనా ధోనీ మైదానంలో కనిపిస్తాడా అని 'ఎల్లో ఆర్మీ' ఆశగా ఎదురు చూస్తోంది. కానీ ధోనీ ఫిట్‌నెస్ సాధిస్తే, కేకేఆర్‌పై ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చే ఛాన్స్ ఉంది. ఒకవేళ అతను రాకపోతే, ఐపీఎల్ 2026 టోర్నీ మొత్తానికి దూరమైనట్లేనని సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతుంది.

# తారక్ 'డ్రాగన్'.. టోవినో ప్లేస్ లో ఎవరు?







యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్, సెన్సేషనల్ దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ ప్రస్తుతం టాలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారింది. ఇంటర్నేషనల్ రేంజ్ లో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకుంటున్న ఆ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.

అయితే ఆ చిత్రానికి సంబంధించిన తాజా అప్డేట్ ఇప్పుడు ఆసక్తి రేకెత్తిస్తోంది. సినిమాలో పవర్ ఫుల్ విలన్ పాత్ర కోసం మలయాళ నటుడు టోవినో థామస్ పేరు గతంలో వినిపించింది. కానీ తాజాగా ఆయన ఆ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నట్లు రీసెంట్ గా స్వయంగా వెల్లడించడం గమనార్హం. ఆ నిర్ణయం తీసుకోవడానికి పర్సనల్ తోపాటు ప్రొఫెషనల్ రీజన్స్ ఉన్నాయని తెలిపారు.టోవినో తప్పుకోవడంతో ఇప్పుడు ఆ కీలక పాత్ర కోసం మరో స్టార్ ను రంగంలోకి దించేందుకు మూవీ టీమ్ ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం.

ముఖ్యంగా ఒక ప్రముఖ బాలీవుడ్ నటుడితో చర్చలు జరుగుతున్నాయని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే ఆ నటుడు ఎవరు అన్నదానిపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. త్వరలో ప్రకటించనున్నారని సమాచారం.విలన్ రోల్ మార్పుతో డ్రాగన్ సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. ఇప్పటికే భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న ఆ చిత్రం, తాజా పరిణామాలతో మరింత హైప్ సొంతం చేసుకుంటోంది. ప్రశాంత్ నీల్ మార్క్ మాస్ ఎలిమెంట్స్, ఎన్టీఆర్ పవర్ ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ కలిస్తే ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టించే అవకాశాలు ఉన్నాయని అంచనాలు వెలువడుతున్నాయి.అయితే దేవర వంటి భారీ విజయానంతరం ఎన్టీఆర్ నటిస్తున్న సినిమా కావడం, సలార్ తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న ప్రాజెక్ట్ కావడం డ్రాగన్ పై ఓ రేంజ్ లో అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా ప్రశాంత్ నీల్ తన హీరోలను ఎలివేట్ చేసే స్టైల్ కు అభిమానులు ఫిదా అవుతుంటారు. ఈ నేపథ్యంలో తారక్ ను సినిమాలో ఎలా చూపిస్తారో అన్న ఆసక్తి అందరిలోనూ కనిపిస్తోంది.

ఇక చిత్రంలో ఎన్టీఆర్ సరసన కన్నడ నటి రుక్మిణీ వసంత్ కథానాయికగా నటిస్తోంది. కీలక పాత్రలో బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్ కని పించ ను న్నారు. సంగీత బాధ్యతలు రవి బస్రూర్ నిర్వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్న ఆ సినిమా నుంచి ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా మే 20 న ఫస్ట్ లుక్ టీజర్ విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. మొత్తానికి, తారక్–నీల్ కాంబోలో వస్తున్న ప్రాజెక్ట్ పై రోజు రోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At FLAT NO. 31, RAJEEV NAGAR, VISAKHA A COLONY, NEAR JAMATHOTA, KILLIPALEM PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. "PEN POWER" vide PRGI Registration No. "APTEL/25/A4918" Editor: GANTYADA APPARAO. e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. Editor GANTYADA APPARAO.e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965